Follow: @ANNTELUGU

18-08-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 224 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




# ఏటా డీఎస్సీ

**నిరుద్యోగులకు లోకేశ్ బిగ్ గుడ్‌న్యూస్!**

- 'ఇక ప్రతి ఏడాది టీచర్ ఉద్యోగాల భర్తీ'
- వైసీపీ ఆరోపణలకు అసెంబ్లీలో మంత్రి లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు మంత్రి నారా లోకేశ్ కీలక ప్రకటన చేశారు. ఇకపై ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీని కేవలం నియామక ప్రక్రియగా కాకుండా బాధ్యతగా తీసుకుందని చెప్పారు. తాజాగా నిర్వహించిన మెగా డీఎస్సీలో 16,347 పోస్టులను భర్తీ చేశామని, 3,36,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ కేవలం 148 రోజుల్లోనే మొత్తం నియామక ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు.డీఎస్సీ నియామకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు తాను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, అయితే ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత మిగతా 2వ పేజీలో

**టాప్ న్యూస్**



## తెలంగాణ సర్ లిస్ట్ రిలీజ్

- 92లక్షలమందికి నోటీసులు
- డేంజర్ లో 22 శాతం ఓట్లు
- సెప్టెంబర్ 17వరకు అభ్యంతరాల స్వీకరణ

02




## కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే ట్రాఫిక్

ఇంకో రెండేళ్ళు ఇలాగే నేటి నుండి అమలు

02



## రెండో పెళ్లి చేసుకుంటే జీతంలో 20 శాతం కట్!

- విడాకుల కేసు కోర్టులో ఉన్నా.. కోతే
- అస్సాం ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం హిమంత బిశ్వ శర్మ వార్నింగ్.

02



## సనత్‌నగర్ టిమ్స్ .. సూపర్

- ప్రత్యేకతలు, సూపర్ 'స్పెషాలిటీ'లు ఇవే
- మొదటి దశలో 582 పడకలతో సేవలు ప్రారంభం

04



తెలంగాణను లైట్ తీస్కున్న బీజేపీ


# బిజెపి జాతీయ కార్యవర్గంలో మొండిచేయి

**లక్ష్మణ్, అరుణ పదవులు ఊస్ట్.. ఒక్కరికి కూడా దక్కని ఛాన్స్**

సంస్థాగత బాధ్యతలు మళ్ళీ సంతోష్ కే.. ఓబీసీ మోర్చా చీఫ్ గా అమర్‌పాల్ మౌర్య

- ఏపీ, కేరళం, తమిళనాడు, కర్నాటక నేతలకు ఛాన్స్
- బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురంధేశ్వరి
- స్మృతి ఇరానీ ఈజ్ బ్యాక్.. పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి

**ఢిల్లీ, మహా :** భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. సౌత్ లో అత్యధిక ఎంపీలున్న తెలంగాణను, తెలంగాణ నేతలను లైట్ తీసుకుంది. గతంలో జాతీయ కార్యవర్గంలో కీలక పదవుల్లో ఉన్న నేతలకు కూడా మొండిచేయి చూపింది. ఓబిసి సెల్ మోర్చా బాధ్యతలు లక్ష్మణ్ నుండి తప్పించి మరొకరికి ఇచ్చింది. గతంలో ఉపాధ్యక్షురాలిగా ఉన్న డీకే అరుణకు ఈసారి చోటివ్వలేదు. తెలంగాణలో తొమ్మిది మంది ఎంపీలు, 8మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఎవరినీ జాతీయకార్యవర్గంలోకి తీసుకోకపోవడం తెలంగాణ నేతల పట్ల బిజెపి హైకమాండ్ తీరు స్పష్టమవుతోంది. గతంలో ముగ్గురునేతలు జాతీయ కార్యవర్గంలో ఉండగా, ఈసారి ఎవరూ లేరు. జాతీయ ఉపాధ్యక్షులుగా 13మందికి అవకాశం ఇవ్వగా, మాజీ రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ జయ్ పాండా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డీ పురందేశ్వరి, రేఖా వర్మ తదితరులకు ఈ బాధ్యతలు దక్కాయి. మొత్తం 13 మంది కొత్త జాతీయ మిగతా 2వ పేజీలో





## పార్టీ మారారు.. మరి ఓటు ఎటు వేశారు?

- బీఆర్ఎస్‌కు హైకోర్టు సూటి ప్రశ్నలు!
- ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై కీలక విచారణ
- విప్ జారీ చేసినప్పుడు ఎక్కడున్నారు? బిల్లులపై ఎవరి వైపు నిలిచారు?

03

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ధర్మాసనం పిటిషనర్‌ను పలు కీలక ప్రశ్నలు మిగితా 2వ పేజీలో

## 2027 డిసెంబర్ నాటికి..

# రాష్ట్రంలోని ఆస్పత్రుల నిర్మాణాలు పూర్తిచేస్తాం

ఉస్మానియా, టిమ్స్, వరంగల్ ఆస్పత్రులు పేదలకోసం తీర్చిదిద్దుతాం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ
- మీరే టిమ్స్ కడితే ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు
- వారు కొబ్బరికాయకొట్టి మరిచిపోయారు.. మేం యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు పూర్తిచేశాం
- బీఆర్ఎస్ నేతలపై సీఎం ఫైర్



**హైదరాబాద్, మహా :** కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ఉస్మానియా, టిమ్స్, వరంగల్ ఆస్పత్రులను తీర్చిదిద్ది పేదలకు వైద్యసేవలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన వచ్చాక విద్య, వైద్యాన్ని ప్రాధాన్యతగా తీసుకున్నామని సీఎం తెలిపారు. విద్యలో అనేక నూతన విధానాలను తీసుకొచ్చామని వివరించారు. పేదల వైద్యాన్ని తమ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. విద్య, వైద్యంపై చేసే వ్యయాన్ని పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే ఎక్కువ ఉపాధి అవకాశాలు మన విద్యార్థులకు వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆస్పత్రిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రైవేటు వైద్యం ఈ రోజుల్లో అత్యంత ఖరీదు వ్యవహారంగా మారిందని రేవంత్ రెడ్డి అన్నారు. తమ పాలనలో ఆరోగ్యశ్రీ కింద రూ.2,700 కోట్లు చెల్లించామని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ కింద రూ.2,526 కోట్లు ఖర్చు పెట్టామన్న ఆయన, పేదల వైద్యం కోసం ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం ఖర్చు చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వైద్యశాఖపై రూ.21 వేల కోట్లు ఖర్చుపెట్టామన్నారు. ఉస్మానియా ఆస్పత్రి కూలిపోయేలా ఉందని, పదేళ్లు అధికారంలో ఉన్నవారికి ఉస్మానియా ఆస్పత్రి కడదామనే మిగతా 3పేజీలో

## నాగబాబుకు ప్రమోషన్

# కేబినెట్ మంత్రి హోదా

03



## 22(ఏ) భూముల అప్‌డేట్‌లో పొరపాటు జరిగింది

**సారీ చెప్పిన పొంగులేటి**

- అధికారుల తరఫున క్షమాపణలు కోరుతున్నామని పొంగులేటి ప్రకటన
- ప్రైవేటు ఆస్తులను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని హామీ
- 22ఏ జాబితా ఫిర్యాదుల పరిష్కారం కోసం 18005994788 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు

02




## గ్రూప్1 స్కాంపై చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

- నా 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి స్కాం చూడలేదు!'
- జగన్ హయాంలో మెరిట్ విద్యార్థులకు అన్యాయం.
- 'ఇది సాధారణ అక్రమం కాదు.. భారీ కుంభకోణం' అంటూ సీఎం చంద్రబాబు ఫైర్

02



## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- అర్హుడి ఓటు పోకుండా చూడటం అందరి బాధ్యత
- కష్టపడేవారికి తగిన గుర్తింపు.. పారదర్శకంగా కమిటీలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పీఏసీ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు

03

**ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం**



# రెండో పెళ్లి చేసుకుంటే జీతంలో 20 శాతం కట్!

- **విడాకుల కేసు కోర్టులో ఉన్నా.. కోతే**
- **అస్సాం ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం హిమంత బిశ్వ శర్మ వార్నింగ్.**

**గౌహతి, మహా:** మొదటి భార్యకు చట్టబద్ధంగా విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకునే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ హెచ్చరించారు. ఇలాంటి ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంతో పాటు.. వారి జీతంలో 20 శాతం మొత్తాన్ని కట్ చేసి మొదటి భార్య బ్యాంకు ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. గౌహతిలోని ఖానాపారా మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు మొదటి భార్యకు చట్టపరంగా విడాకులు ఇవ్వకుండానే రెండో పెళ్లి చేసుకోవడం లేదా మరో మహిళతో సహజీవనం చేయడం వంటి ఘటనలు ఇటీవల పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

**విడాకుల కేసు కోర్టులో ఉన్నా.. జీతం నుంచి కోత!**

మొదటి భార్యకు విడాకులు ఇచ్చేందుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ కోర్టులో కొనసాగుతున్నప్పటికీ.. ఆ వ్యవహారం పూర్తయ్యేలోపు మరో పెళ్లి చేసుకున్న ఉద్యోగులపైనా చర్యలు ఉంటాయని హిమంత బిశ్వ శర్మ స్పష్టం చేశారు.

మొదటి భార్య ప్రభుత్వం వద్ద ఫిర్యాదు లేదా వినతిపత్రం సమర్పిస్తే.. సంబంధిత ఉద్యోగిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యే వరకు మొదటి భార్యకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతోనే జీతంలో 20 శాతం కోత విధించే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

**సర్వీస్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

చట్టాన్ని ఉల్లంఘించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా తమకు వర్తించే సేవా నిబంధనలను అతిక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. ఉద్యోగుల వ్యక్తిగత వ్యవహారాలు సేవా నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. మొదటి భార్య హక్కులు, ఆర్థిక భద్రతను కాపాడటంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల్లో నిబంధనల పట్ల బాధ్యతను పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం తెలిపారు.

## తెలంగాణను లైట్ తీస్కున్న బీజేపీ
# బిజెపి జాతీయ కార్యవర్గంలో మొండిచేయి

( మొదటి పేజీ తరువాయి )



ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం ప్రత్యేకంగా నిలిచింది. వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి, భారతి ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్య, ప్రొఫెసర్ ఎం. నాగరాజ, ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్, మధుచంద్ర కర్ తదితరులు కూడా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.

**జాతీయ కార్యదర్శులుగా 16 మందికి చోటు**

జాతీయ కార్యదర్శుల జాబితాలోనూ పలు రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించారు. మధ్యప్రదేశ్ నుంచి కవితా పటిదార్, కేరళ నుంచి కె. సురేంద్రన్, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి డాక్టర్ భోలా సింగ్, జార్ఖండ్ నుంచి ప్రదీప్ వర్మ, గుజరాత్ నుంచి జగదీశ్ ఇశ్వర్‌భాయ్ పటేల్ నియమితులయ్యారు. ఢిల్లీ నుంచి సందీప్ పాఠక్, స్వదేశ్ సింగ్, జై ప్రకాశ్, నాగాలాండ్ నుంచి ఫాంగ్నోన్ కొన్యాక్, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి సంగీత యాదవ్, కేరళ నుంచి అనిల్ ఆంటోనీ, తమిళనాడు నుంచి ఎం. వెంకటేశన్, బంగాల్ నుంచి మనోజ్ టిగ్గా, బిహార్ నుంచి సిద్ధార్థ్ శంభు, అసోం నుంచి మృగాంక దేవ్ బర్మన్, గుజరాత్ నుంచి రోహన్ గుప్తాకు జాతీయ కార్యదర్శుల బాధ్యతలు అప్పగించారు.

**మళ్ళీ బీఎల్ సంతోష్**

పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక మార్పులు చేసిన అధిష్ఠానం.. కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్‌ను, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్యను నియమించింది. సంస్థాగత జనరల్ సెక్రటరీగా బి.ఎల్. సంతోష్, సంస్థాగత జాయింట్ జనరల్ సెక్రటరీగా శివప్రకాశ్ తమ బాధ్యతలను కొనసాగించనున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు మరోసారి బీజేపీ జాతీయ కోశాధికారి బాధ్యతలు అప్పగించారు. పార్టీ ఆర్థిక వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు. రాజ్యసభ సభ్యుడు తరుణ్ చుగ్‌ను కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా నియమించారు. గుజరాత్ ఎంపీ హేమాంగ్ జోషికి బీజేపీ యువమోర్చా బాధ్యతలు అప్పగించగా., ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రూప్ కుమారి చౌధరీ మహిళా మోర్చాను పర్యవేక్షించనున్నారు.

**స్మృతి ఇరానీ ఈజ్ బ్యాక్**

మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించింది. పార్టీ జాతీయ స్థాయి వ్యవహారాల్లో ఆమెకు మరింత కీలక పాత్ర లభించనుంది. కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవం, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర నేపథ్యంలో ఆమెకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ ఎన్నికల నేపథ్యంలో కూడా ఆమె ప్రాధాన్యత పెంచారు.

**మీడియా, సోషల్ మీడియా టీమ్‌లోనూ మార్పులు**

బీజేపీ మీడియా విభాగంలోనూ కీలక బాధ్యతలను ఖరారు చేసింది. లోక్‌సభ ఎంపీ అనిల్ బలూనీ మీడియా కన్వీనర్‌గా కొనసాగనున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశిశ్ ఉషా అగర్వాల్, ఢిల్లీకి చెందిన ప్రదీప్ భండారీ, సిద్ధార్థ్ యాదవ్ కోకన్వీనర్లుగా వ్యవహరించనున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్‌కు సోషల్ మీడియా కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు. పార్టీ ప్రచార వ్యూహాల్లో సామాజిక మాధ్యమాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

**యూపీ సవాల్**

నితిన్ నబీన్ కొత్త టీమ్‌కు ముందున్న అతిపెద్ద సవాలు 2027 అసెంబ్లీ ఎన్నికలే. ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు కీలక రాష్ట్రాల్లో వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచడం, సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయడం కొత్త టీమ్‌కు కీలకంగా మారనుంది.

**2018కి ముందు ఉన్నట్లు..**

3 2018కి ముందు ఉన్నట్లు బిజెపి ఈసారి తన వ్యూహం మార్చుకున్నట్లు స్పష్టమవుతోంది. నేతల మధ్య విభేదాలు, నేతలు పార్టీ కంటే వ్యక్తిగత ఇమేజ్ కోసం, ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారన్న నివేదికలు, పలు ప్రయత్నాలు చేసినా.. గ్రౌండ్ లో స్పందన లేకపోవడంతో.. తెలంగాణలో ప్రస్తుత నేతల సామర్థ్యంపై బిజెపి జాతీయ నాయకత్వానికి నమ్మకం కుదిరినట్లు కనిపించడం లేదు. 20192023 మధ్య అగ్రెసివ్ వ్యూహంతో ఉన్న కమలం ఇపుడు రూటు మార్చి 20214 2018 మధ్య తెలంగాణలో అనుసరించిన వ్యూహాన్ని ఎంపికచేసుకుందా అనే చర్చ మొదలైంది.

## తెలంగాణ సర్ లిస్ట్ రిలీజ్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర సవరణ ముసాయిదా ఓటరు జాబితా విడుదలైంది. ఎన్యుమరేషన్ తర్వాత రాష్ట్రంలో 78.03 శాతం ఓటర్లు ఉన్నారని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎవరి ఓట్లయినా లేకపోయినట్లయితే ఫామ్ 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 92 లక్షల మందికి నోటీసులు ఇస్తామని సీఈవో సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆన్ మ్యాప్డ్ జాబితాలో ఉన్నవారికి కూడా నోటీసులు జారీ చేస్తామని వివరించారు. నోటీసులు అందుకున్నవారు సమాధానం ఇచ్చేందుకు సెప్టెంబర్ 16వ తేదీ తుదిగడువుగా పేర్కొన్నారు. 73 లక్షల మంది ఏఎస్‌డీ(అబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్) లిస్ట్‌లో ఉన్నారని సుదర్శన్ రెడ్డి తెలిపారు.

**అభ్యంతరాల స్వీకరణ**

సర్‌లో భాగంగా నోటీసుల జారీ, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇవ్వనున్నారు. ఎన్యుమరేషన్ పత్రాలు ఇచ్చిన వారిలో సుమారు 32. 36 లక్షల మంది గత 2002 ఎస్ఐఆర్ వివరాలను ప్రస్తావించలేదు. గత ఎస్ఐఆర్‌లో తమ వివరాలు లేదా కుటుంబ సభ్యుల వివరాలను పేర్కొనలేదు. అన్‌మ్యాపింగ్ ఓటర్లుగా పేర్కొంటూ వారందరికీ ఎన్నికల కమిషన్ నోటీసులు రానున్నాయి. మరో 61 లక్షల మంది ఎన్యూమరేషన్ ఫారాల్లో 2002 ఎస్ఐఆర్ వివరాలు ప్రస్తావించినప్పటికీ, అసంబద్ధంగా ఉన్నాయి. అలాంటి వాటిని 'అనామలిస్' ఓటర్లుగా పేర్కొంటూ వారికి కూడా నోటీసులు ఇచ్చేందుకు సీఈవో కార్యాలయం జాబితాను సిద్ధం చేసింది. సోమవారం నుంచి సెప్టెంబర్ 17 వరకు నెల రోజుల పాటు ఓటర్ల వివరణలు, అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరించనున్నారని తెలిసింది. అక్టోబర్ 19వ తేదీన తుది ఓటరు జాబితాను అధికారులు ప్రకటిస్తారు

# గ్రూప్-1 స్కాంపై చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏపీపీఎస్సీ గ్రూప్ 1 వ్యవహారం మరోసారి ప్రకంపనలు సృష్టిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రూప్ 1 అక్రమాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో స్పందించారు. తన సుదీర్ఘ 50 ఏళ్ల రాజకీయ జీవితంలో గ్రూప్ 1 తరహా కుంభకోణాన్ని ఎన్నడూ చూడలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంలో ఎంతోమంది మెరిట్ విద్యార్థులు బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేసిన సీఎం చంద్రబాబు.. గ్రూప్ 1 వ్యవహారాన్ని అత్యంత తీవ్రమైన అంశంగా అభివర్ణించారు. దీనికి సంబంధించిన అన్ని విషయాలను ఎల్లుండి అసెంబ్లీలో సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు. దీంతో గ్రూప్ 1 నియామకాల వ్యవహారంపై అసెంబ్లీలో కీలక చర్చకు రంగం సిద్ధమైనట్లయింది.

**'50 ఏళ్లలో ఇలాంటి స్కాం చూడలేదు'**

గ్రూప్ 1 అక్రమాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. తన రాజకీయ జీవితంలో ఎన్నో ప్రభుత్వాలను, ఎన్నో నియామక ప్రక్రియలను చూసినప్పటికీ.. గ్రూప్ 1 తరహా స్కాం తనకు ఎప్పుడూ ఎదురుకాలేదని సీఎం వ్యాఖ్యానించారు.ఈ వ్యవహారంలో ప్రతిభ ఆధారంగా ముందుకు రావాల్సిన అనేక మంది మెరిట్ విద్యార్థులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి కష్టపడి చదివిన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.

**అసెంబ్లీలో పూర్తి చర్చకు సిద్ధం**

గ్రూప్ 1 వ్యవహారంపై ఎల్లుండి అసెంబ్లీలో అన్ని అంశాలను చర్చిస్తామని చంద్రబాబు తెలిపారు. నియామక ప్రక్రియలో ఏం జరిగింది? ఎలాంటి ఆరోపణలు వచ్చాయి? మెరిట్ అభ్యర్థులకు ఎలా అన్యాయం జరిగిందనే అంశాలను సభలో ప్రభుత్వం వివరించే అవకాశం ఉంది.సీఎం స్వయంగా ఈ వ్యవహారాన్ని తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో చూడని స్థాయి స్కామ్‌గా అభివర్ణించడంతో అసెంబ్లీ చర్చపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది

**డీఎస్సీపై మహిళా టీచర్లకు 'ఎమోషనల్ బాండింగ్'**

ఇదే సందర్భంగా డీఎస్సీ అంశాన్ని కూడా సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. డీఎస్సీలో మహిళా ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. విజయవాడలో ఆదివారం ఉపాధ్యాయులు నిర్వహించిన ఆందోళనపై స్పందిస్తూ.. మహిళా టీచర్లు అక్కడ తమ అభిప్రాయాలను, ఆవేదనను బలంగా వ్యక్తం చేశారని చెప్పారు.వారు కేవలం నిరసన కోసం రోడ్డుపైకి రాలేదని, ఆత్మాభిమానంతో, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే పెద్ద సంఖ్యలో తరలివచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు.

**'డీఎస్సీతో మహిళా టీచర్లకు భావోద్వేగ అనుబంధం ఉంది'**

డీఎస్సీ ప్రక్రియతో మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన భావోద్వేగ అనుబంధం ఉందని సీఎం వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఎంతోమంది మహిళలు కష్టపడి చదివి, పరీక్షలు రాసి, తమ జీవితంలో కీలకమైన అవకాశంగా డీఎస్సీని భావిస్తారని అన్నారు.అలాంటి డీఎస్సీ ప్రక్రియపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు మహిళా ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని, అందుకే వారు ఆందోళనకు దిగారని చంద్రబాబు పేర్కొన్నారు.

**గ్రూప్-1 నుంచి డీఎస్సీ వరకు.. ఉద్యోగాలపై ఏపీలో రాజకీయ వేడి**

ఒకవైపు గ్రూప్ 1 నియామకాలపై భారీ అక్రమాల ఆరోపణలను ప్రభుత్వం తెరపైకి తీసుకురాగా.. మరోవైపు మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విమర్శలకు ప్రభుత్వం కౌంటర్ ఇస్తోంది. తాజాగా మంత్రి నారా లోకేశ్ ఇకపై ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగ నియామకాల అంశం ఏపీ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది.ఈ నేపథ్యంలో చంద్రబాబు చేసిన తాజా వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గ్రూప్ 1 వ్యవహారాన్ని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం ఎలా వివరిస్తుంది? ఏయే ఆధారాలను బయటపెడుతుంది? గత ప్రభుత్వ హయాంలో నియామక ప్రక్రియపై ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.'50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి స్కాం చూడలేదు' అన్న చంద్రబాబు వ్యాఖ్యలతో గ్రూప్ 1 వ్యవహారం ఏపీ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఎల్లుండి అసెంబ్లీలో జరగనున్న చర్చ ఈ అంశానికి మరింత రాజకీయ వేడిని తీసుకురావడం ఖాయంగా కనిపిస్తోంది.

# యూజీసీ–నెట్‌లో వరుస తప్పిదాలు

- **ఎన్‌టీఏపై కేంద్రం సర్జికల్ స్ట్రైక్!**
- **50 మందికి పైగా సిబ్బందిపై వేటు.**
- **10 కీలక కొత్త పోస్టులు.. ఇక పరీక్షల భద్రతపై నిఘా.**

**ఢిల్లీ, మహా :**యూజీసీ-నెట్ పరీక్షల్లో వరుసగా వెలుగుచూస్తున్న లోపాలు, పలు పరీక్షల పునఃనిర్వహణ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ ఎన్‌టీఏ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. పరీక్షల నిర్వహణలో నాణ్యత, పారదర్శకత, భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా భారీ మార్పులకు కేంద్రం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఎన్‌టీఏలో 50 మందికి పైగా సిబ్బందిని తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వారి స్థానంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వారిని నియమించేందుకు 10 కీలక వృత్తిపరమైన పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దీప్తి గౌర్ ముఖర్జీ, ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఇతర ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి ఎన్‌టీఏ చేపడుతున్న సంస్కరణలను అధికారులు మంత్రికి వివరించారు.

# 22(ఏ) భూముల అప్‌డేట్‌లో పొరపాటు జరిగింది

- **సారీ చెప్పిన పొంగులేటి**
- **అధికారుల తరపున క్షమాపణలు కోరుతున్నామని పొంగులేటి ప్రకటన**
- **22ఏ జాబితా ఫిర్యాదుల పరిష్కారం కోసం 18005994788 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు**

**హైదరాబాద్, మహా :** అర్బన్ ల్యాండ్ సీలింగ్ లోని భూములను నిషేధిత జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం నుంచి 22(ఏ) నిషేధిత జాబితాపై సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని ఆయన వివరించారు. వీలైనంత త్వరగా ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలిగించి విముక్తి కల్పిస్తామని ఆయన వెల్లడించారు. ఎవరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం అంతకంటే లేదని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వం విక్రయించిన కొన్ని ఆస్తులు కూడా ప్రస్తుతం 22(ఏ) జాబితాలోనే చేరాయని తెలిపారు. న్యాయబద్ధంగా ఉన్న భూములకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉంటే ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. 22ఏ జాబితాను అప్‌డేట్ చేయడంలో అధికారులు పొరపాటు చేశారన్న మంత్రి అధికారుల తరపున క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొన్నారు.

**నాలుగు జిల్లాల నుంచి అప్లికేషన్లు**

ఉన్నతాధికారుల కమిటీ పరిశీలన తర్వాత 22ఏ నుంచి భూములను తొలగిస్తామన్న పొంగులేటి సీఎస్ 7, 14 భూములను రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. 22ఏ భూములపై మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి ఈ నాలుగు జిల్లాల నుంచి అప్లికేషన్లు వచ్చాయని తెలిపారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారని 750 మంది అప్లికేషన్ పెట్టారన్న ఆయన 22ఏ భూములపై ఈ నాలుగు జిల్లాల అధికారులతో కలిసి చర్చించామన్నారు. ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. 22ఏలో పెట్టిన భూములు గతంలో యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయని చెప్పారు. నిషేధిత జాబితా భూములకు సంబంధించి హైకోర్టులో 6 వేలకుపైగా కేసులు ఉన్నాయన్న ఆయన హైకోర్టుకు పాత కాపీని ఇచ్చారన్నారు. తాజా జాబితా ఇస్తే కేసులు కొట్టేస్తామని హైకోర్టు తెలిపిందని, యూఎల్‌సీ, జీవోల ద్వారా ఇచ్చిన భూములను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేదన్నారు.

పొరపాటు జరిగింది

ప్రైవేటు ఆస్తులను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ప్రైవేటు భూములు క్లియర్ చేస్తామన్నారు. 22ఏ జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందని ఒప్పుకున్నారు. అధికారుల తరపున క్షమాపణలు కోరుతున్నట్లు చెప్పారు. కేసు బై కేసు విచారణ చేసి క్లియర్ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. 22ఏ జాబితా ఫిర్యాదుల పరిష్కారం కోసం 18005994788 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. 22(ఏ) సమస్య చాలా కాలంగా జరుగుతూ వచ్చిన తప్పిదమని వివిధ రూపాలల్లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం రిజిస్ట్రేషన్లు అయిన ఆస్తులను ఆన్‌లైన్ చేయకపోవడంతో జరిగిన పొరపాటని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే ట్రాఫిక్

**హైదరాబాద్ సిటీ, మహా:** హెచ్‌సిటీ అభివృద్ధిలో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే ట్రాఫిక్ పద్ధతి మంగళవారం అమల్లోకి రానుంది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న ప్రధాన జంక్షన్లలో రూ.1,090 కోట్లతో 7 మల్టీలెవల్ స్టీల్ ఫ్లైఓవర్లు పైవంతెనలు, 7 అండర్‌పాస్‌ల నిర్మాణం నేపథ్యంలో హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ,ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్.సిటీ) ప్రాజెక్ట్‌ను చేపట్టింది. ఈ పనులు 24 నెలల పాటు సాగనుండడంవల్ల వాహనాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని వన్‌వే అమలును పోలీసు యంత్రాంగం చేయనుంది. కేబీఆర్ పార్క్ పరిసర కారిడార్‌లో 'హెచ్‌సిటీ' ప్రాజెక్ట్ కింద కొనసాగుతున్న ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల దృష్ట్యా ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ఈ కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని తీసుకొచ్చారు. వాహన రాకపోకలకు ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించి అమలు చేయనున్నట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ మార్గంలో గంటకు 10 నుంచి 15 వేల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. సాధారణ సిగ్నల్ విధానంతో ట్రాఫిన్ నియంత్రించడం సవాలుతో కూడిన విషయం. కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ సమస్యను అధిగమించి సాఫీగా ప్రయాణించటమే లక్ష్యంగా హెచ్‌సిటీ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నామని సీపీ సజ్జనార్ వివరించారు.




# ఏపీలో ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ఇక గుడ్‌న్యూస్

- *** మ్యుటేషన్ కష్టాలకు చెక్.**
- *** రిజిస్ట్రేషన్‌తోనే మున్సిపల్ రికార్డుల్లో పేరు మార్పు.**
- *** మ్యుటేషన్ ఫీజు కూడా అప్పుడే చెల్లింపు.**

**అమరావతి, మహా:** ఆస్తుల కొనుగోలు, విక్రయాల తర్వాత యజమాని పేరు మార్పు కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెరదించనుంది. ఆస్తుల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసే ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనముల మూడో సవరణ బిల్లుకు శాసనసభ సోమవారం ఆమోదం తెలిపింది. మంత్రి నారాయణ బిల్లును సభలో ప్రవేశపెట్టగా.. స్వల్ప చర్చ అనంతరం సభ్యులు ఆమోదించారు.

రిజిస్ట్రేషన్ పూర్తయితే.. పేరు కూడా మారినట్టే!

ఇప్పటివరకు ఆస్తి రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మున్సిపల్ రికార్డుల్లో యజమాని పేరు మార్చేందుకు ప్రత్యేకంగా మ్యుటేషన్ ప్రక్రియను చేపట్టాల్సి వచ్చేది. దీంతో ఆస్తి కొనుగోలుదారులు మరోసారి మున్సిపల్ కార్యాలయాలను ఆశ్రయించాల్సి వచ్చేది.

తాజా సవరణతో ఈ విధానంలో కీలక మార్పు రానుంది. ఇకపై ఆస్తి రిజిస్ట్రేషన్ జరిగే సమయంలోనే మున్సిపల్ రికార్డుల్లో యజమాని పేరు మారేలా రిజిస్ట్రేషన్ వ్యవస్థను మున్సిపల్ రికార్డులతో అనుసంధానం చేయనున్నారు.

**ఒక్కసారి ఫీజు.. రెండు పనులు**

రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ ఫీజును చెల్లించేలా చట్టంలో మార్పులు చేశారు. దీంతో రిజిస్ట్రేషన్ తర్వాత మ్యుటేషన్ కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేయడం, ఫీజు చెల్లించడం వంటి ప్రక్రియలు సులభతరం కానున్నాయి.అదేవిధంగా కార్పొరేషన్లు, వివిధ స్థాయి మున్సిపాలిటీల్లో వేర్వేరుగా ఉన్న మ్యుటేషన్ ఫీజుల స్థానంలో ఏకీకృత ఫీజుల విధానం తీసుకురావడానికి సవరణలు చేశారు.

**ఆస్తుల బదలాయింపు మరింత వేగంగా**

కొత్త విధానం అమల్లోకి వస్తే ఆస్తి రిజిస్ట్రేషన్ నుంచి మున్సిపల్ రికార్డుల్లో యజమాని పేరు మార్పు వరకు ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది. పౌరులు ఒకే ప్రక్రియలో అవసరమైన పనులను పూర్తి చేసుకునేలా వ్యవస్థను సరళీకరించడమే సవరణల ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది.మున్సిపల్ రికార్డుల్లో యాజమాన్య మార్పులు ఆలస్యం కావడం, మ్యుటేషన్ కోసం ప్రత్యేకంగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం వంటి సమస్యలకు ఈ సవరణలతో పరిష్కారం లభించే అవకాశం ఉంది. ఆస్తి రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే యజమాని పేరు మున్సిపల్ రికార్డుల్లోనూ మారేలా కొత్త విధానం అమల్లోకి రానుండటంతో ఆస్తి యజమానులకు భారీ ఊరట లభించనుంది.

# ఏటా డీఎస్సీ

( మొదటి పేజీ తరువాయి )

ప్రభుత్వంపై ఉందని లోకేశ్ అన్నారు. మెగా డీఎస్సీ ఎలా నిర్వహించారు? ఎలాంటి నిబంధనలు పాటించారు? నియామక ప్రక్రియలో ఎలాంటి పారదర్శకత పాటించారు? అనే వివరాలను సభ్యులకు పుస్తక రూపంలో అందజేశామని తెలిపారు.

'ఏటా డీఎస్సీ.. టీచర్ ఉద్యోగాల భర్తీ ఆపేది లేదు'

ఉపాధ్యాయ నియామకాలు లేకుండా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందవని లోకేశ్ స్పష్టం చేశారు. అందుకే ఇకపై ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహించాలన్న నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. టీచర్ పోస్టుల భర్తీని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని చెప్పారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, తమ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు సుమారు 1.80 లక్షల మంది ఉపాధ్యాయులను నియమించినట్లు లోకేశ్ వెల్లడించారు. మహిళలకు డీఎస్సీలో 33 శాతం రిజర్వేషన్ కల్పించామని తెలిపారు.

**16,347 పోస్టులు.. 3.36 లక్షల దరఖాస్తులు**

కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని మంత్రి తెలిపారు. ఈ పోస్టుల కోసం 3,36,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. భారీ సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడినప్పటికీ కేవలం 148 రోజుల్లో నియామక ప్రక్రియను పూర్తి చేయడం తమ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమన్నారు.డీఎస్సీ ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశామని, వివిధ దశల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించామని తెలిపారు. అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలకు సంబంధించి 336 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.



**'పేపర్ లీక్ అంటున్నారు.. ఆధారాలు ఎక్కడ?'**

వైసీపీ నేతలపై లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియపై ఏడాది తర్వాత అక్రమాలు జరిగాయని ఆరోపించడం సరికాదన్నారు. "మీ ఆరోపణలకు ఆధారాలు చూపండి" అంటూ ప్రతిపక్షానికి సవాల్ విసిరారు.

డీఎస్సీ పరీక్షను టీసీఎస్ ఐయాన్ ప్లాట్‌ఫామ్ ద్వారా నిర్వహించామని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను జిల్లా యూనిట్ స్థాయిలో చేపట్టామని వివరించారు. నియామకాల్లో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను అమలు చేశామని తెలిపారు.

**టెట్ తప్పనిసరి.. ఎస్సీ వర్గీకరణ తర్వాతే డీఎస్సీ**

టీచర్ నియామకాల్లో అర్హత ప్రమాణాలను కఠినంగా అమలు చేశామని లోకేశ్ చెప్పారు. టీచర్ క్వాలిఫికేషన్‌లో టెట్‌ను తప్పనిసరి చేశామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయి, ఉపకులాలను సంబంధిత గ్రూపుల్లో సెట్ చేసిన తర్వాతే డీఎస్సీ నిర్వహించామని స్పష్టం చేశారు.నోటిఫికేషన్ నుంచి పరీక్ష, సర్టిఫికెట్ వెరిఫికేషన్, నియామకాల వరకు ప్రతి దశలో పారదర్శకత పాటించామని పేర్కొన్నారు.

**స్పోర్ట్స్ కోటాపై కూడా కీలక నిర్ణయం**

డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాను కూడా విస్తరించినట్లు మంత్రి తెలిపారు. గతంలో 29 స్పోర్ట్స్ కేటగిరీలు ఉండగా వాటిని 65 కేటగిరీలకు పెంచామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఈ మార్పు చేశామని స్పష్టం చేశారు.

**'వైసీపీ హయాంలో టీచర్లను ఏం చేశారు?'**

గత వైసీపీ ప్రభుత్వంపై లోకేశ్ తీవ్ర విమర్శలు చేశారు. 2019 నుంచి 2024 వరకు ఒక్క టీచర్ ఉద్యోగ నియామకం కూడా జరగలేదని ఆరోపించారు. వైసీపీ పాలనలో సుమారు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిపోయారని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ అందించేందుకు సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాలకు పంపుతోందని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాత్రం ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టారని లోకేశ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**'డీఎస్సీ అంటే కూడా తెలియని వాళ్లే ఆరోపణలు చేస్తున్నారు'**

డీఎస్సీ ప్రక్రియపై అవగాహన లేని కొందరు నేతలు పేపర్ లీక్, అక్రమాలంటూ ఆరోపణలు చేస్తున్నారని లోకేశ్ విమర్శించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పక్కాగా పూర్తయిన తర్వాతే అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు.

"ఏడాది తర్వాత డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. ఆరోపణలకు ఆధారాలు చూపండి" అంటూ వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. డీఎస్సీపై టీమ్ 11 చేస్తున్న ఆరోపణలు అనవసరమైనవని కొట్టిపారేశారు.

**నిరుద్యోగులకు భారీ భరోసా**

అసెంబ్లీ వేదికగా లోకేశ్ చేసిన 'ఏటా డీఎస్సీ' ప్రకటన ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధ్యాయ ఉద్యోగార్థుల్లో ఆసక్తిని రేపుతోంది. ప్రతి ఏడాది ఖాళీలను గుర్తించి నియామక ప్రక్రియ చేపడితే టీచర్ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అభ్యర్థులకు నిరంతర అవకాశాలు లభించే అవకాశం ఉంది.మొత్తంగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ పూర్తి చేశామని చెప్పిన ప్రభుత్వం.. ఇకపై ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించడం ద్వారా నిరుద్యోగులకు మరో కీలక హామీ ఇచ్చింది. ఒకవైపు వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన లోకేశ్.. మరోవైపు డీఎస్సీ ప్రక్రియలో పారదర్శకత, రిజర్వేషన్లు, టెట్, ఎస్సీ వర్గీకరణ, స్పోర్ట్స్ కోటా వంటి అంశాలపై అసెంబ్లీలో పూర్తి వివరాలు వెల్లడించారు. దీంతో ఏపీ విద్యా, ఉద్యోగ రంగంలో 'ఏటా డీఎస్సీ' ప్రకటన ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.



### సంధ్య థియేటర్ కేసులో అల్లు అర్జున్

# వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాంపల్లి కోర్టుకు హాజరు

- సెప్టెంబర్ 1కి విచారణ వాయిదా

**హైదరాబాద్, మహా. :** సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో ప్రముఖ నటుడు అల్లు అర్జున్ సోమవారం నాంపల్లి కోర్టు విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. కేసుకు సంబంధించిన తదుపరి విచారణను కోర్టు సెప్టెంబర్ 1కి వాయిదా వేసింది. దీంతో తదుపరి విచారణలో కోర్టు ఎలాంటి ఆదేశాలు జారీ చేయనుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

**పుష్ప–2 ప్రదర్శనలో విషాదం**

2024 డిసెంబరు 4న 'పుష్ప-2' చిత్ర ప్రీమియర్ ప్రదర్శన సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది.ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అల్లు అర్జున్‌తో పాటు థియేటర్ యాజమాన్యం, నిర్వహణ, భద్రతా సిబ్బంది తదితరులపై కేసులు నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తు అనంతరం మొత్తం 23 మందిపై అభియోగాలతో చార్జిషీట్ దాఖలు చేసినట్లు వెల్లడైంది.

**వర్చువల్‌గా కోర్టు విచారణకు బన్నీ**

కేసు విచారణలో భాగంగా అల్లు అర్జున్ సోమవారం నాంపల్లి కోర్టుకు ప్రత్యక్షంగా హాజరుకాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. అనంతరం కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 1కి వాయిదా వేస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది.

**సెప్టెంబర్ 1న ఏం జరగబోతోంది?**

తాజాగా విచారణను సెప్టెంబర్ 1కి వాయిదా వేయడంతో ఆ రోజున కేసు ఏ దిశగా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. సంధ్య థియేటర్ ఘటనకు సంబంధించిన కేసులో న్యాయ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో తదుపరి విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయాలపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.

గతంలోనూ అల్లు అర్జున్ ఈ కేసులో కోర్టు విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఆయన ప్రత్యక్షంగా కోర్టుకు వస్తే అభిమానులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉండటంతో భద్రతా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వర్చువల్ హాజరుకు అనుమతి కోరినట్లు గతంలో నివేదికలు వెలువడ్డాయి.23 మందిపై అభియోగాలు.. విచారణ కీలక దశలో సంధ్య థియేటర్ వద్ద జనసందోహాన్ని నియంత్రించడం, భద్రతా ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణ, పోలీసులతో సమన్వయం తదితర అంశాలపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, సంబంధిత వ్యక్తుల బాధ్యతలపై దర్యాప్తు చేపట్టి అభియోగాలు నమోదు చేశారు.ఈ కేసులో అల్లు అర్జున్‌ను 2024 డిసెంబరు 13న పోలీసులు అరెస్టు చేయగా.. అదే రోజు తెలంగాణ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం నాంపల్లి కోర్టు సాధారణ బెయిల్ మంజూరు చేసింది.

# వరుస ఆలయ దొంగతనాలను ఛేదించిన జిల్లా పోలీసులు

**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 17, మహా:** యాదాద్రిభువనగిరి జిల్లాలోని మోటకొండూర్, గుండాల, వలిగొండ, ఆత్మకూర్ (ఎం) పోలీస్‌స్టేషన్ల పరిధిలో వరుసగా జరిగిన ఆలయ దొంగతనం కేసులను యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఒక నిందితుడిని అరెస్టు చేయగా, మరో సీసీఎల్ పరారీలో ఉన్నాడు.సోమవారం తిమ్మాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనాల తనిఖీల సందర్భంగా నంబర్ ప్లేట్ లేని టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా నిందితుడు బండారి దుర్గాప్రసాద్ (23)ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో పలు ఆలయ దొంగతనాలకు సంబంధించిన వివరాలను వెల్లడించాడు.రూ.11,200 నగదు, టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనం, 2 పెద్ద ఆలయ గంటలు, 5 మధ్యస్థాయి గంటలు, శతగోపములు, హారతి ప్లేట్లు, కలశాలు, రాగి పాత్రలు, గోపురం కలశాలు, గోపురం ప్లేట్లు, బంగారు/వెండి వస్తువులు తదితర ఆలయ పూజా సామగ్రితో పాటు స్పానర్లు, స్క్రూడ్రైవర్లు, ఇనుప రాడ్ వంటి నేరానికి ఉపయోగించిన పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు.



నిందితులు గ్రామ శివార్లలోని, జనసంచారం తక్కువగా ఉన్న ఆలయాలను రెక్కీ నిర్వహించి లక్ష్యంగా చేసుకునేవారు. దొంగిలించిన పూజా సామగ్రిని వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టి, అనంతరం స్క్రాప్ దుకాణాల్లో విక్రయించేవారు.ఈ ఆపరేషన్ ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ నాయకత్వంలో, డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డి, చౌటుప్పల్ మార్గదర్శకత్వంలో, ఎం. రవి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, రామన్నపేట పర్యవేక్షణలో, సీసీఎస్ భువనగిరి సహకారంతో ఎస్ఐ ఎన్. లక్ష్మీనారాయణ, ఆత్మకూర్ (ఎం) పోలీస్‌స్టేషన్ మరియు వారి సిబ్బంది నిర్వహించారు.వరుస ఆలయ దొంగతనాలను ఛేదించి ఆలయ ఆస్తులను రికవరీ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ అభినందించారు.పరారీలో ఉన్న మరో నిందితుడిని పట్టుకోవడంతో పాటు, ఇతర కేసులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. ఆలయ నిర్వాహకులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.



### సర్ ఫేజ్-2 సన్నాహక సమావేశంలో

# పాల్గొన్న మీనాక్షి నటరాజ్

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 17 మహా:** భువనగిరి పట్టణంలోని హోటల్ వివేరాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ & ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఎస్ ఐ ఆర్ ఫేజ్ 2 సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ SIR ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందని తెలిపారు. జిల్లాలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఫేజ్ 2 ప్రక్రియను కూడా ఇదే స్ఫూర్తితో విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి తప్పులు, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు SIR ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేముల వీరేశం, మందులు సామెల్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి,ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా అధ్యక్షులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# 2027 డిసెంబర్ నాటికి.. రాష్ట్రంలోని ఆస్పత్రుల నిర్మాణాలు పూర్తిచేస్తాం

( మొదటి పేజీ తరువాయి )

ఆలోచన రాలేదన్నారు.

**కొబ్బరికాయకొట్టి మరిచిపోయారు**

బీఆర్ఎస్ ప్రభుత్వం టిమ్స్ ఆస్పత్రులకు కొబ్బరి కాయ కొట్టిందని, నిర్మాణాన్ని మాత్రం మర్చిపోయిందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. టిమ్స్ ఆస్పత్రులు పూర్తయితే పేదల వైద్యానికి 10 వేల పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. 2027 డిసెంబర్ 9లోపు ఉస్మానియా, మిగిలిన టిమ్స్ ఆస్పత్రులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులకు తీసిపోని విధంగా ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వహిస్తామన్న రేవంత్ రెడ్డి, టిమ్స్‌కు వచ్చే రోగులకు ఆహారం, ఇతర వసతులు కల్పిస్తున్నామన్నారు. రోగులతో పాటు వచ్చే బంధువులకు ఆహారం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్ నేతలు పగటి వేషగాళ్ల మాదిరిగా తయారై హడావుడి చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభిస్తామనేలోపే ఇక్కడికి వచ్చి హడావుడి చేస్తున్నారన్నారు. ఇక్కడికి వచ్చి టిమ్స్‌ను పరిశీలించి ఇది వాళ్లే కట్టామంటున్నారన్నారు. ఈ సందర్భంగా సనత్ నగర్ ఎమ్మెల్యే తీరుపై సీఎం ఛలోక్తులు విసిరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సర్జరీలు చేసే డాక్టర్లకు ఇన్సెంటివ్స్ ఇస్తామన్నారు. పేదలకు విశ్వాసం కలిగిస్తే మన జన్మసార్థకం అయినట్లేనన్నారు. విద్యార్థులకు ఉచిత విద్య, సాంకేతిక నైపుణ్యం అందిస్తే వాళ్లే బతుకుతారు. ఎవరూ ఇష్టంతో సంక్షేమ పథకాలు తీసుకోరు, కష్టం వస్తేనే తీసుకుంటారన్నారు. ప్రజలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా విధానాలు అమలు చేస్తే సంక్షేమ పథకాలు కోరుకోరన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ , ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



### నాగబాబుకు ప్రమోషన్

# కేబినెట్ మంత్రి హోదా

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం, అటవీ విస్తరణ, పునరటవీకరణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబును నియమించింది. ఈ మేరకు పర్యావరణ, అటవీ శాఖ జీవో ఆర్టీ నంబర్-93 ద్వారా నియామక ఉత్తర్వులు జారీ చేసింది. నాగేంద్రబాబుకు ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపు, అటవీ విస్తరణ, రీఫారెస్టేషన్ కార్యక్రమాల అమలులో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ కీలక పాత్ర పోషించనుంది. ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా నాగేంద్రబాబు రాష్ట్ర గ్రీన్ లక్ష్యాల అమలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, కార్యక్రమాల పర్యవేక్షణలో కీలక బాధ్యతలు నిర్వహించనున్నారు. ఏపీ గ్రీన్, జిల్లా గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల కార్యకలాపాలు సమర్థవంతంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆయన నేతృత్వంలోని కమిటీని ఆదేశించింది.

**3కేబినెట్ ర్యాంక్‌తో మరింత ప్రాధాన్యం**

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా నియమించిన నాగేంద్రబాబుకు కేబినెట్ ర్యాంక్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు లోబడి ఈ హోదా వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, అటవీ విస్తీర్ణాన్ని పెంచడం, పట్టణ-గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని విస్తరించడం వంటి లక్ష్యాలతో ఏపీ గ్రీన్ కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది.2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం ఫారెస్ట్, ట్రీ కవర్ సాధించాలన్న భారీ లక్ష్యం నేపథ్యంలో.. నాగేంద్రబాబుకు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా కేబినెట్ హోదాతో బాధ్యతలు అప్పగించడం కీలక పరిణామంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ కార్యక్రమాల అమలులో ఈ కొత్త వ్యవస్థ ఎంత మేరకు ఫలితాలు సాధిస్తుందనేది రానున్న రోజుల్లో కీలకంగా మారనుంది.







# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం
- అర్హుడి ఓటు పోకుండా చూడటం అందరి బాధ్యత
- కష్టపడేవారికి తగిన గుర్తింపు.. పారదర్శకంగా కమిటీలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పీఏసీ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు



ఆదిలాబాద్ మహా : ఉమ్మడి జిల్లాలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ , ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సోమవారం ఉట్నూర్ జీఎన్ఆర్ కాంప్లెక్స్‌లో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పీఏసీ సమావేశానికి వారు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలోని కొమరం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ , నిర్మల్ , మంచిర్యాల నాలుగు జిల్లాల పీఏసీ సభ్యులతో విడివిగా సమావేశమై నేతలకు దిశానిర్దేశం చేసారు. అంతకు ముందు సమావేశ ప్రాంగణానికి చేరుకున్న మంత్రికి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో నేతలు మాట్లాడారు.

**బలోపేతమే లక్ష్యంగా - సచిన్ సావంత్**

కాంగ్రెస్ నేతలు వర్గ విభేదాలను పక్కనపెట్టి ప్రభుత్వం, పార్టీని బలోపేతం చేసేలా సమన్వయంతో పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లి ఓటర్లు జాబితా నుంచి పేర్లు గల్లంతు కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ఫేజ్ 2 కార్యాచరణను పకడ్బందీగా అమలయ్యేలా చూడాలన్నారు. బీఎల్ఏ 2లు కార్యకలాపాలను సమన్వయంతో పర్యవేక్షించాలని సూచించారు. పట్టణ, డివిజన్, మండల కమిటీల నియామకాలను పారదర్శకంగా చేపట్టాలని చెప్పారు.కాంగ్రెస్ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులకు ప్రభుత్వం, పార్టీలో తగిన గుర్తింపు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు.

**అర్హుడి ఓటు పోకుండా చూడాలి - జూపల్లి కృష్ణారావు**

జిల్లాలలో పార్టీ బలోపేతం కోసం నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీజేపీ ఇతర రాష్ట్రాలలో తొలగించిన విధంగా ఓట్ల తోలగింపును అడ్డుకోవాలంటే అందరి ఓట్లు పోకుండా చూడాలన్నారు. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు ను కాపాడటమే తమ పార్టీ సిద్ధాంతమన్నారు. అర్హుడి ఒక్క ఓటు కూడా పోకుండా చూడాలన్నారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో అవినీతి జరగకుండా అమలు జరగాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకోళ్లాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌లో అన్ని స్థానాలు గెలిచేలా సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు. పార్టీలో కష్టపడే వారికి పదవులు దక్కుతాయని తెలిపారు. ఈ సమావేశంలో పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ , ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, ఆదిలాబాద్ బోథ్ నిర్మల్ ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇంచార్జిలు కంది శ్రీనివాస రెడ్డి, ఆడె గజేందర్ , శ్రీహరి రావు,శ్యామ్ నాయక్ , మాజీ మంత్రులు వేణుగోపాలచారి ,అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావు ,గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు సుగుణ, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు సాజిద్ ఖాన్, గంద్రత్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



# పార్టీ మారారు.. మరి ఓటు ఎటు వేశారు?

( మొదటి పేజీ తరువాయి )

సంధించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టినప్పుడు ఎటువైపు ఓటు వేశారు? విప్ జారీ చేసినప్పుడు వారి వైఖరి ఏమిటి? మూజువాణి ఓటులో ఎవరి వైపు నిలిచారు? అంటూ ప్రశ్నించింది.బీఆర్ఎస్ తరఫున వాదనలు వినిపిస్తూ.. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేశారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ఫిరాయింపునకు సంబంధించిన ఆధారాలను స్పీకర్ ట్రైబ్యునల్‌కు సమర్పించినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని వాదించారు.

**'పార్టీ మారిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ ఏం చేసింది?'**

పిటిషనర్ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో బీఆర్ఎస్ స్వయంగా ఎలాంటి చర్యలు తీసుకుందని ప్రశ్నించింది. విప్ జారీ చేసిన సమయంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎక్కడ ఉన్నారు? అసెంబ్లీలో కీలక బిల్లులపై ఓటింగ్ జరిగినప్పుడు వారి వైఖరి ఎలా ఉంది? అని ఆరా తీసింది.

అంతేకాకుండా మూజువాణి ఓటు సమయంలోనూ పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ వైపు మొగ్గు చూపారో వివరించాలని ధర్మాసనం ప్రశ్నించింది.

**'మేము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమే' అంటున్నారు.. కానీ పార్టీ కార్యక్రమాలకు దూరం!**

కోర్టు ప్రశ్నలకు స్పందించిన పిటిషనర్.. పార్టీ మారిన ఎమ్మెల్యేలు తాము ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమేనని చెప్పుకుంటున్నారని తెలిపారు. అయితే అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లో మాత్రం పాల్గొనడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.దీంతో పార్టీ ఫిరాయింపులు, అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రవర్తన, విప్ అమలు, ఓటింగ్ సమయంలో వారి వైఖరి వంటి అంశాలు ఈ కేసులో కీలకంగా మారాయి. పార్టీ ఫిరాయింపులపై దాఖలైన పిటిషన్ విచారణలో హైకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## విరాళాల కేసులో సుప్రీం సంచలన ఆదేశాలు

ఢిల్లీ, మహా :అయోధ్య శ్రీరామ మందిర విరాళాల చోరీ, దుర్వినియోగం ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం త్వరితగతిన విచారణ పూర్తి చేసి తార్కిక ముగింపునకు రావాలని స్పష్టం చేసింది. ఇప్పటివరకు దర్యాప్తులో సాధించిన పురోగతిపై సమగ్ర స్థితిగతుల నివేదికను రెండు వారాల్లోగా సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశించింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. దర్యాప్తు పారదర్శకంగా సాగేందుకు వివిధ పక్షాలు చేసే సహేతుకమైన సూచనలను కూడా ప్రత్యేక దర్యాప్తు బృందం పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

**'త్వరగా దర్యాప్తు పూర్తి చేయండి'**

అయోధ్య రామ మందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల నిర్వహణలో అక్రమాలు, చోరీ, దుర్వినియోగం జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ విచారణను నిరవధికంగా కొనసాగించకుండా త్వరగా పూర్తి చేసి తార్కిక ముగింపునకు తీసుకురావాలని సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది.

ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, నమోదు చేసిన కేసులు, జరిగిన విచారణ, ఆర్థిక లావాదేవీల పరిశీలన, తదుపరి దర్యాప్తు చర్యలు తదితర అంశాలతో కూడిన నివేదికను రెండు వారాల్లో కోర్టుకు అందించాలని స్పష్టం చేసింది.

**విరాళాల నిర్వహణపై సుప్రీం దృష్టి**

ప్రత్యేక దర్యాప్తు బృందం సమర్పించే నివేదికను పరిశీలించిన తర్వాత భక్తులు సమర్పించే విరాళాల నిర్వహణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడానికి మార్గదర్శకాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది.

అంటే ఈ కేసులో నేరం జరిగిందా లేదా అన్న అంశంతోపాటు.. భవిష్యత్తులో ఆలయాలకు వచ్చే భారీ మొత్తాల విరాళాలను మరింత పారదర్శకంగా, భద్రంగా నిర్వహించేందుకు ఎలాంటి వ్యవస్థ ఉండాలన్న అంశంపైనా సుప్రీంకోర్టు దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

**జులైలో మొదలైన కీలక పరిణామాలు**

అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగంపై పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో జులై 13న సుప్రీంకోర్టు యూపీ పోలీసులను దర్యాప్తు పురోగతిపై స్థితిగతుల నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

ANN తెలుగు
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్
18-08-2026











# సనత్‌నగర్ టిమ్స్.. సూపర్

## ప్రత్యేకతలు, సూపర్ 'స్పెషాలిటీ'లు ఇవే
## మొదటి దశలో 582 పడకలతో సేవలు ప్రారంభం



**(మహా ప్రత్యేకం) :** తెలంగాణ ప్రాంతంలో మరో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చింది. సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆసుపత్రిలో మొదటి దశలో 582 పడకలతో సేవలు ప్రారంభించారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుపుకుంది. ప్రైవేట్ ఆసుపత్రులతో పోలిస్తే టిమ్స్ విదేశీ రోగులకు చాలా తక్కువ ధరలకే సేవలను అందించనుంది. ఈ సేవలు రెండో దశలో అందుబాటులోకి రానున్నాయి. పేదలకు సేవలు పూర్తిగా ఉచితంగా ఉంటాయి. ఆసుపత్రి నిర్వహణ, మౌలిక సదుపాయాల ఖర్చులను భరించడానికి విదేశీ రోగుల నుంచి వచ్చే ఆదాయంతో పాటు నిమ్స్ తరహాలో 200 పడకలను పేయింగ్ రోగులకు కేటాయించనున్నారు.

**ప్రత్యేకతలు ఇవే :**

టిమ్స్ సనత్‌నగర్‌ను ప్రధానంగా కీలక వైద్య విభాగాలకు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా అభివృద్ధి చేశారు.

37 విభాగాలలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందిస్తుండగా, ఈ ఆసుపత్రి కొన్ని ప్రధాన వైద్య సమస్యలకు సంబంధించిన చికిత్స, పరిశోధనలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది.

తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలకు చికిత్స, శస్త్ర చికిత్సల కోసం కార్డియాక్, థొరాసిక్ సైన్సెస్ విభాగాలను ఏర్పాటు చేశారు. మూత్రపిండాలు, కాలేయం, గుండె మార్పిడి సహా అవయవ మార్పిడి కోసం ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు.

మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు, చికిత్సలు, పరిశోధనల కోసం నెఫ్రాలజీ, యూరాలజీ విభాగంలో ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. క్లిష్టమైన 'గోల్డెన్ అవర్' సమయంలో రోగులకు సకాలంలో సహాయం అందించడానికి 24 గంటల ట్రామా కేర్ సేవలు అందించనున్నారు.

**అత్యాధునిక విభాగాలు :**

అత్యవసర పరిస్థితుల్లో కూడా సంక్లిష్టమైన చికిత్సలు అందించడానికి 300కు పైగా ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ICU) పడకలు అందుబాటులో ఉన్నాయి.

అన్ని రకాల క్లిష్టమైన శస్త్ర చికిత్సల కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఎంఆర్ఐ, సిటీ స్కాన్ సౌకర్యాలు, రోబోటిక్ సర్జరీ సామర్థ్యాలతో కూడిన 16 అధునాతన ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు.

అవయవ మార్పిడి సౌకర్యాలలో అత్యాధునిక మాడ్యులర్ థియేటర్లు, ప్రయోగ శాలలు, ఇన్ఫెక్షన్ రహిత ఐసీయూలు, ప్రత్యేక వార్డులు ఉన్నాయి. తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులను ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లకు వేగంగా తరలించడానికి ప్రత్యేక రవాణా మార్గాలు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. వీటితో పాటు విభాగాల మధ్య వైద్య నమూనాలను బదిలీ చేయడానికి ఒక ప్రత్యేక సాంకేతిక వ్యవస్థ కూడా ఉంది.

**నిర్మాణ వ్యయం : రూ.1,070 కోట్లు**
**విస్తీర్ణం: 22.6 ఎకరాలు**
**బ్లాక్‌లు: 3**
**అంతస్తులు: 5**
**మొత్తం పడకలు: 1,082**

**రోజుకు 4 వేల మందికి వైద్య సేవలు**

24 గంటల పాటు అందుబాటులో ఉండేలా అంబులెన్సు సేవలు, డయాగ్నోస్టిక్స్, రోగులు ఎక్కువ సేపు క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, నర్స్ కాలింగ్ వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఏడాది మే నుంచే ఓపీ ట్రయల్ రన్‌ను నిర్వహిస్తుండగా, రోజుకు దాదాపు 300 మందికి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి ప్రారంభం నుండి రోజుకు సుమారు 4 వేల మందికి వైద్య సేవలు అందేలా తీర్చిదిద్దారు. మర్రిచెన్నారెడ్డి టిమ్స్ హైదరాబాద్ లో మరో ప్రత్యేక ఆకర్షణ కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, అనిల్ యాదవ్, బల్మూరి వెంకట్, నవీన్ యాదవ్, శ్రీగణేష్ తదితరులు పాల్గొన్నారు.





# విప్పలగుంపులో వైద్య శిబిరం

- **గిరిజనులకు పరీక్షలు.. మందుల పంపిణీ..**
- **పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించిన డాక్టర్ ఉమాదేవి**

**మణుగూరు, మహా :** మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామం విప్పలగుంపులో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవి వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో గృహ సందర్శన చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు దోమతెరలను తప్పనిసరిగా ఉపయోగించాలని అవగాహన కల్పించారు. గ్రామంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమల లార్వా వృద్ధి చెందకుండా యాంటీ లార్వాల్ మందు, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. వర్షాకాలంలో జ్వరాలు, ఇతర అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ తరుణ్, సూపర్‌వైజర్లు, మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల అభివృద్ధికి పాయం పెద్దపీట

- **రూ.15 లక్షలతో గ్రౌండ్ లెవలింగ్ పనులు..**
- **భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**
- **విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యమని వెల్లడి..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితిసింగారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో రూ.15 లక్షలతో చేపట్టనున్న గ్రౌండ్ లెవలింగ్ పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన మౌలిక వసతులు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కళాశాలలో అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య మరింత అందుబాటులోకి తీసుకురావాలంటే ప్రభుత్వ కళాశాలల్లో అవసరమైన సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

**క్రీడలు, కార్యక్రమాలకు అనువుగా..**

గ్రౌండ్ లెవలింగ్ పనులు పూర్తయితే కళాశాల ప్రాంగణం విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా మారుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వివిధ విద్యా కార్యక్రమాల నిర్వహణకు అనువైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కళాశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని, అందులో భాగంగానే రూ.15 లక్షలతో గ్రౌండ్ లెవలింగ్ పనులు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. పనులు పూర్తయితే కళాశాల ప్రాంగణం రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, తాసిల్దార్ అద్దంకి నరేష్, సంబంధిత అధికారులు, కళాశాల అధ్యాపకులు, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు కురం రవి, జిల్లా ముఖ్య నాయకులు కూచిపూడి బాబు, జీవి, శ్రీనివాస్, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మైనారిటీ విభాగం అధ్యక్షుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# నేడు దిశా కమిటీ సర్వసభ్య సమావేశం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఐడీఓసీ కార్యాలయంలో మంగళవారం దిశా కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి దిశా కమిటీ కోచైర్మన్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, జడ్పీ చైర్మన్, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, దిశా కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు హాజరుకానున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శాఖల వారీగా కార్యక్రమాల అమలు తీరు పురోగతి సమస్యలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన సమగ్ర నివేదికలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.



# ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లకు భద్రతపై ప్రత్యేక శిక్షణ..

**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ మణుగూరు ఏరియా పరిధిలో పనిచేస్తున్న ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లకు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు రెండు వారాల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏరియా అధికారులు తెలిపారు. మణుగూరు ఏరియా ఎంవీటీసీలో సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 29 వరకు కొనసాగనుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ డి వెంకట రామారావు శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లు విధి నిర్వహణలో అనేక బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని, గనుల్లో యంత్రాల మధ్య పనిచేసే కార్మికులకు సరైన రక్షణ పరికరాలు అందుబాటులో ఉన్నాయా, భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేసే కార్మికులకు అవగాహన కల్పిస్తూ సురక్షితమైన పని విధానాలను అలవాటు చేయడంలో సూపర్‌వైజర్లు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. గనుల్లో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని, ప్రమాదాలను నివారించడంలో సూపర్‌వైజర్లు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వెంకట రామారావు సూచించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం, వాటికి తక్షణ పరిష్కార మార్గాలను అనుసరించడం వంటి అంశాలపై ఈ రెండు వారాల శిక్షణలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం (పర్సనల్) ఎస్ రమేష్, ఏరియా బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ఏరియా సేఫ్టీ వైస్ ప్రెసిడెంట్ వి కృష్ణంరాజు, సీఐటీయూ జనరల్ సెక్రటరీ వి మధన్ నాయక్, ఏరియా రక్షణ అధికారి రామన్ వి పాకర్, ఎంవీటీసీ మేనేజర్ జి నాగేశ్వరరావు, ఎస్ఈ (ఎస్ఎంఎంసీ) డి బాబ్జీతో పాటు పలువురు ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

- **ప్రజలకు చేరువగా ప్రజావాణి మండలాల్లోనూ నిర్వహణ**
- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అతను కలెక్టర్ విద్యా చందన, డి ఆర్ వో పద్మావతితో కలసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాల అమలు ఉపాధి, పెన్షన్లు గృహాలు మౌలిక వసతులు సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ప్రభుత్వం కల్పించిన ముఖ్యమైన వేదిక అని అన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో ప్రజల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పరిష్కార స్థితిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని మండలాల్లో కూడా ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలోనే ప్రజలు తమ సమస్యలు వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు తమ వినతులతో పాటు సమస్యకు సంబంధించిన అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ వాల్‌పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజావాణితో సమస్యల సత్వర పరిష్కారం!

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 136 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి శారదదేవికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ శారదదేవి మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-60, ఇతర శాఖలు 76, మొత్తం దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా యెర్రా కామేష్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రతీ ఏడాది కొత్తగూడెం పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవ సమితి సమావేశం స్థానిక భజన మందిర్ రోడ్డులో ఉన్న విశ్వహిందూ పరిషత్ కార్యాలయం వివేకానంద హైస్కూల్ లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కొత్తగూడెం నగర అధ్యక్షులు వందనపు శ్రీధర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది యెర్రా కామేష్ ని, ప్రధాన కార్యదర్శిగా దారా రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కామేష్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ఈ ఏడాది కూడా భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని ఎక్కడ ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా చేస్తామని ప్రభుత్వ అధికారులు ప్రజలు సహకరించాలని కోరారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా మాజీ జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కె.వి.రంగకిరణ్, కొదమ సింహం పాండురంగ చార్యులు, పలివెల సాంబశివ రావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శర్మ, జిల్లా కార్యాలయ ప్రముఖ భాస్కర్ రెడ్డి, విజయలక్ష్మి, వి.ఎచ్.పి కొత్తగూడెం నగర ఉపాధ్యక్షులు ఆగుళ్ల యాకయ్య, కార్యదర్శి నాగుల రవి కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు గోమలాపురం సత్యనారాయణ, ఆగుళ్ల సుజాత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఉపాధ్యక్షురాలుగా పొన్నెకంటి జయకుమారి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులుగా పొన్నెకంటి జయకుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ మేరకు హైదరాబాదులో సోమవారం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి జయ కుమారికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతిలు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీని బలోపేతం చేసి భవిష్యత్తులో రాష్ట్ర కమిషనర్లతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తద్వారా సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి కొందరికి ఉన్న అపోహలను అవగాహన సదస్సుల ద్వారా తొలగించాలని కమిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు తదితరులు పాల్గొన్నారు.




# బాధితుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

- **ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి**
- **ఇల్లందు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఇల్లందు పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం అధికారులు సిబ్బందితో స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను బాధ్యతగా పరిష్కరించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకొని పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్టికల్స్ వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి పనితీరు విధుల నిర్వహణ తీరును పరిశీలించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు సేవలను మరింత వేగవంతంగా పారదర్శకంగా అందించాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లను నిరంతరం సమీక్షిస్తూ సంబంధిత వ్యక్తుల కదలికలు కార్యకలాపాలపై నిఘా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఫోన్ వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, సీఐ సురేష్, ఎస్సైలు ఉమా, సారంగపాణి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నీట్‌పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **పరీక్ష కేంద్రంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి**
- **అభ్యర్థుల గుర్తింపు సీసీటీవీ విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** జిల్లాలో ఈ నెల 30న నిర్వహించనున్న నీట్‌పీజీ-2026 పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు సాంకేతిక అంతరాయాలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీట్‌పీజీ-2026 పరీక్ష ఈ నెల 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుజాతనగర్‌లోని అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్‌లో నిర్వహించనున్నారు. జిల్లాలో ఇదే ఏకైక పరీక్షా కేంద్రం కాగా మొత్తం 100 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, అభ్యర్థుల ఫ్రిస్కింగ్ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా మాల్‌ప్రాక్టీస్ నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఆభరణాలు వాటర్ బాటిల్లు ఎటువంటి వస్తువులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరాదని నిశితంగా పరిశీలించిన తర్వాతను మాత్రమే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని ఆదేశించారు. పరీక్షా సమయంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. పరీక్ష సమయాల్లో విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో ఇంటర్నెట్, సీసీటీవీ కెమెరాలు తదితర సాంకేతిక సదుపాయాలు సక్రమంగా పనిచేసేలా ముందస్తుగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సుజాతనగర్ తహసీల్దార్ పరీక్షా కేంద్రాన్ని ముందుగానే సందర్శించి ఫర్నిచర్ తాగునీరు మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను పరిశీలించి లోటుపాట్లు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సెక్షన్ 163 అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను ఆ సమయంలో మూసివేయించాలి. పరీక్ష సమయంలో తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులకు అత్యవసర వైద్య సహాయం అందించేందుకు పరీక్షా కేంద్రంలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రథమ చికిత్స కిట్లు అవసరమైన మందులు ఓఆర్ఎస్ తదితరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ అవకతవకలకు అవకాశం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్ నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సుజాతనగర్ తహసీల్దార్ వి.కృష్ణ ప్రసాద్‌ను డ్యూటీ మేజిస్ట్రేట్‌గా నియమించారు. కొత్తగూడెం ఆర్డీఓ పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తూ పరీక్ష సమయంలో తనిఖీలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ బి.శ్రీకాంత్, అబ్జర్వర్‌గా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి హెచ్.వెంకటేశ్వరరావు విధులు నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రతి అధికారి తనకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లయితే నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నీట్‌పీజీ పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ రెవెన్యూ విద్యుత్ వైద్య విద్య ఎన్ఐసీ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్వో పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సుజాతనగర్ తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, అబ్దుల్ కలాం కళాశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్, పోలీస్ శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆటో కార్మికుల హక్కులను విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- **ఏఐటియుసి లో 50 మంది ఆటో కార్మికులు చేరిక**
- **కండువా కప్పి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య**

**జూలూరుపాడు, మహా**:ఆటో కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమ్మలయ్య విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో యూనియన్ మండల కార్యదర్శి చాంద్ పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ఆటో కార్మికులు నష్టపోతున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి కాలం గడుపుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు 12 వేల రూపాయలు ఇస్తామని, అమలు చేయటంలో పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆటో స్టాండ్లు, ఇందిరమ్మ ఇల్లు, కార్పొరేషన్ ల ద్వారా ఆటోలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐటియుసి కార్యక్రమాలకు ఆకర్షితులైన సుమారు 50 మంది ఆటో కార్మికులకు కండువా కప్పి యూనియన్ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కంచర్ల రాఘవేంద్రరావు, వలమల సామేలు, గార్లపాటి వీరభద్రం, యాసా రోశయ్య, సిరిపురపు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు గార్లపాటి శివకృష్ణ, కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ అబ్బులు, దేశి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- **మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ల**

**మంచిర్యాల, మహా** : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి హాజరై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం క్యాతనపల్లి లోని గాంధీనగర్ కు చెందిన లింగంపల్లి లక్ష్మి తాను దినసరి కూలీగా పని చేసుకుంటూ జీవిస్తున్నామాకు రెండు పడక గదుల ఇల్లు ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన మొగిలి మల్లయ్య తనకు వారసత్వంగా వచ్చిన భూమిని తన అన్నదమ్ములు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఈ విషయంపై న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం మాల గురుజాల గ్రామ సర్పంచ్ పెద్దబోయిన శ్యామలత తమ గ్రామ రైతులకు పంటల సాగు కొరకు మత్తడి మరమ్మత్తులకు తక్షణ సహాయం అందించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గవ్వల రాజమణి, పెరుగు తిరుపతి లు తమకు గల పట్టా భూమిలో సాగు కొరకు ఉచిత విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని అండాళమ్మ కాలనీకి చెందిన ఓరుగంటి నరసమ్మ తమ ఇంటి పక్కన డంపింగ్ యార్డ్ ఉండడంతో దోమలు, ఈగలతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, డంపింగ్ యార్డ్ తొలగించి తగు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కాలనీకి చెందిన భాగ్యలక్ష్మి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# అనిల్ కుమార్‌కు కీలక బాధ్యత

**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 17, మహా:** తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా టంగుటూరు గ్రామ సర్పంచ్ జూకంటి అనిల్ కుమార్ నియమితులయ్యారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సంఘం సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు సుర్వి యాదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ నాగయ్య, రామ్ మోహన్ రావు, వీవీ రావు, శర్బణపురం సర్పంచ్ మొగులగాని నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



# కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి

- **ప్రజావాణిలో అధికారులకు సీపీఎం పార్టీ నాయకుల వినతి**

**సత్తుపల్లి, ఆగస్టు 17**: మహా మండల పరిధిలోని పలు గ్రామాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను వెంటనే పునఃప్రారంభించి పూర్తి చేయాలని సీపీఎం సత్తుపల్లి మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన మండలస్థాయి ప్రజావాణిలో అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023లో సత్తుపల్లి మండలంలోని సిద్ధారం, గంగారం, కిష్టారం, రామగోవిందపురం, తుమ్మూరు, నారాయణపురం, పాకలగూడెం, బేతుపల్లి, రేజర్ల, కాకర్లపల్లి, బుగ్గపాడు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి మొత్తం రూ.2.75 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఒక్కో కమ్యూనిటీ హాల్‌కు రూ.25 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లతో కూడిన భవనాల నిర్మాణాలను కాంట్రాక్టర్లు మధ్యలోనే నిలిపివేయడంతో అవి అసంపూర్తిగా మిగిలిపోయాయని అన్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు కమ్యూనిటీ హాళ్లు అందుబాటులోకి రాకపోవడంతో నిధులు కేటాయించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తి నిర్మాణాల సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే విచారణ చేపట్టి, అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని జాజిరి జ్యోతి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణరావు, తడికమళ్ల రామకృష్ణ, అయినంపూడి సనందరావు, ఫరీదా, ఆంగోతి చిట్టెమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగాలి

- **మందమర్రి తాసిల్దార్ కార్యాలయం ముందర భారత రాష్ట్ర సమితి ఆందోళన ధర్నా**

**మందమర్రి మహా** : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మందమర్రి తాసిల్దార్ కార్యాలయం ముందర సోమవారం ఆందోళన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలుపుదల చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కపట నాటకాలు ఆడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. అమలు కాని పథకాలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన సర్కార్ కుట్టిలత్వాన్ని ప్రజలు గ్రహిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్మన్ పర్సన్ సంధ్యారాణి డాక్టర్ రాజారమేష్, మందమర్రి పట్టణ, మందమర్రి మండలం, క్యాతన్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు, వార్డు అధ్యక్షులు, యువజన, విద్యార్థి, సోషల్ మీడియా నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ సతీష్ కుమార్ కు అందజేశారు.



# ఐపీఎం.. నిరంజన్ రెడ్డికి ఘన గౌరవం.. అభినందనల వెల్లువ

- **కంగ్రాచులేషన్ చెప్పిన పోలీస్ కమిషనర్..**

**కరీంనగర్ మహా**: విధి నిర్వహణలో చూపిన ధైర్య సాహసాలు, నక్సల్స్ కార్యకలాపాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఇండియన్ పోలీస్ మెడల్ (IPM) అందుకున్న కరీంనగర్ రూరల్ సీఐ అనుముల నిరంజన్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.ఆగస్టు 15న హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న నిరంజన్ రెడ్డి సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

**"మీ సేవలు ఆదర్శప్రాయం"**

పోలీస్ విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ ప్రజల భద్రత కోసం నిరంజన్ రెడ్డి అందించిన సేవలు ఆదర్శప్రాయమని సీపీ గౌష్ ఆలం ప్రశంసించారు. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోవడం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు తప్పక లభిస్తుందని, సమాజ హితం కోసం మరింత కష్టపడి పనిచేసి ఇలాంటి అరుదైన పురస్కారాలకు ఎంపిక కావాలని సిబ్బందికి సూచించారు.

**ప్రజల నుంచి ప్రత్యేక అభినందనలు**

ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న సీఐ నిరంజన్ రెడ్డిని ఆయన పరిధిలోని ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. పోలీస్ శాఖలో ఆయన చేసిన సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చూపిన చొరవను ప్రశంసించారు.



**స్టేషన్‌కు చేరుకోగానే ఘన స్వాగతం**

ఐపీఎం అందుకున్న అనంతరం తొలిసారి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న నిరంజన్ రెడ్డికి సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అరుదైన గౌరవం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. విధి నిర్వహణలో మరింత బాధ్యతతో పనిచేస్తానని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.నిరంజన్ రెడ్డి సాధించిన ఈ ఘనత పోలీస్ సిబ్బందిలో కొత్త స్ఫూర్తిని నింపిందని, ఆయన సేవలను ఆదర్శంగా తీసుకుని ప్రజల కోసం మరింత అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పోలీస్ అధికారులు, సిబ్బంది అభిప్రాయపడ్డారు.



# ప్రజావాణి దరఖాస్తులు సత్వారం పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

యాదాద్రి భువనగిరి ఆగస్టు 17 మహా :ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 102 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.

అందులో రెవిన్యూ శాఖ 66, మున్సిపాలిటీ 7,సర్వే ల్యాండ్స్ 6, స్పెషల్ డిప్యూటీ యూనిట్ 4, గ్రామీణ అభివృద్ధి శాఖ 3, ఎస్సీ డెవలప్మెంట్ 2, ఇరిగేషన్ 2, హౌసింగ్ 2, విద్యాశాఖ 2, డిఎల్పిఓ 2, బీసీ సంక్షేమం, వైద్య ఆరోగ్య, చేనేత మరియు జౌళి, ఉపాధి కల్పన, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా పరిషత్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్ , కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# భారీ వర్షాలు కురవాలని గ్రామ దేవత బొడ్రాయికి నీళ్లు పోసిన మహిళలు

**భువనగిరి ఆగస్టు 17 మహా న్యూస్ :** భువనగిరి మండలం తుక్కాపూర్ గ్రామంలో సర్పంచ్ జనగాం పాండు ఆధ్వర్యంలో సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో వర్షం కురవడం లేదని వర్షాలు బాగా కొట్టాలని పాడిపంటలు పచ్చగా ఉండాలని గ్రామ రైతులందరూ వర్షాలు కురిస్తేనే సుఖ సంతోషంగా ఉంటారని అంటూ అలాగే బొడ్రాయి వద్ద భారీ ఎత్తున మహిళలు బతుకమ్మడుతూ గ్రామ దేవత అయినటువంటి బొడ్రాయకి నీళ్లు పోయడం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ. లోకేష్ మాజీ ఎంపీటీసీ నల్ల మాస సత్యనారాయణ గౌడ్, మహిళా వార్డ్ నెంబర్లు, తుమ్మటి భాగ్యలక్ష్మి దేవేందర్, బొంత కృష్ణవేణి రమేష్, జనగాం ఇందిరమ్మ యాదయ్య, పేరుమల అలివేల రాజశేఖర్ రెడ్డి, గ్రామ మహిళలు పెద్దలు, రాసాల నీలమ్మ, మేకల అండాలు, నోముల లలిత, రాసాల లావణ్య, ఎదునూరి సత్తమ్మ, కోళ్ల బాలమ్మ, గ్రామ మహిళలందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# పీ.యం.జే. జ్యువెలర్స్ బందిపోటు దొంగల ముఠాపై పీడీ యాక్ట్

**ప్రధాన నిందితులైన ఐదుగురిపై నిర్బంధ ఉత్తర్వులు**

**కరీంనగర్, మహా:** కరీంనగర్ పట్టణంలోని పీ.యం.జే. జ్యువెలర్స్‌లో జరిగిన సంచలన బందిపోటు దొంగతనం కేసులో ప్రధాన నిందితులైన ఐదుగురు ముఠా సభ్యులపై కరీంనగర్ పోలీసులు పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) అమలు చేశారు. ఈ మేరకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు.

2026 మే 3న పీ.యం.జే. జ్యువెలర్స్‌లోకి చొరబడిన నిందితులు సిబ్బందిపై తుపాకులతో కాల్పులు జరిపి, సుమారు రూ.82 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ప్రధాన నిందితులైన ఐదుగురిపై సోమవారం (ఆగస్టు 17) పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు.

పీడీ యాక్ట్ అమలైన నిందితులు:

1. రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జాగీరా సింగ్ (41), పశ్చిమ బెంగాల్.
2. రావిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమాన్ (23), నలంద జిల్లా, బీహార్.
3. సూర్యమణి కుమార్ అలియాస్ సనోజ్ (21), నలంద జిల్లా, బీహార్.
4. యాదవ్ అలియాస్ జైనుల్ అబ్దిన్ (33), ఫుల్వారీ షరీఫ్, పాట్నా జిల్లా, బీహార్.
5. మొహమ్మద్ ఆదిల్ ఖాన్ (31), ఫుల్వారీ షరీఫ్, పాట్నా జిల్లా, బీహార్.

నిందితులు పునరావృతంగా నేర కార్యకలాపాలకు పాల్పడకుండా అడ్డుకోవడం, ప్రజల భద్రతకు భరోసా కల్పించడం, ఇలాంటి నేరాలకు పాల్పడే వారిలో చట్టంపై భయాన్ని కలిగించడం లక్ష్యంగా పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను కరీంనగర్ జిల్లా జైలులో నిందితులకు అందజేశారు. అనంతరం వారిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.పీడీ యాక్ట్ అమలులో కీలకంగా వ్యవహరించిన కరీంనగర్ పట్టణ ఏసీపీ ఎన్. వెంకటస్వామి, కరీంనగర్ రెండో పట్టణ సీఐ కె. సృజన్ రెడ్డిలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించారు. నేరాలకు పాల్పడే వారిపై కరీంనగర్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే నేరస్థులపై చట్టపరంగా కఠిన చర్యలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.



## మంత్రి జూపల్లికి స్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఉట్నూర్ లో జరిగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పిఏసి సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక శాఖ మాత్యులు ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఇంద్రవెల్లి వద్ద బొకే అందించి స్వాగతం పలికారు.శాలువాతో సత్కరించిన అనంతరం ఉట్నూర్ కు బయలుదేరివెళ్లారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, ఇజ్జగిరి సంజయ్, అడ్డి భోజరెడ్డి, శాంతన్ రావు, అశోక్, సంటెన్న, షేఖిల్, రఫిక్, తమ్మల చందు, గొర్ల రాము,నిఖిలెష్ తదితరులు హాజరయ్యారు.

# ఉమ్మడి నల్గొండ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 17 మహా** ఉమ్మడి నల్గొండ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ ( పిఎసి ) సమావేశం భువనగిరి పట్టణంలోని న్యూ వివేరా హోటల్‌లో సోమవారం జరిగింది. భువనగిరి జిల్లాకు సంబంధించిన అంశాలపై డీసీసీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ , జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ , పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ,రోడ్లుభవనాలు & సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో పార్టీకి సంబంధించిన వివిధ కమిటీల ఏర్పాటు, తాజా రాజకీయ పరిస్థితులు, సర్ ఫేజ్ 2 కార్యాచరణ, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, సర్ ఫేజ్ 2 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. అలాగే పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.ఈ సమావేశంలో ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, పీసీసీ జనరల్ సెక్రటరీలు, ఐవైసీ జిల్లా అధ్యక్షులు, , ఎస్సీ ఎస్టీ ఓబీసీ మైనారిటీ, మహిళా విభాగాల జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.






## టీ కప్పులో తుఫాన్ లాంటిది

- కూర్చుని చర్చించి పరిష్కరించుకుంటాం
- పార్టీ పటిష్టతే ముఖ్యంగా కలిసి పని చేస్తాం
- మరోమారు పార్టీని అధికారంలోకి వచ్చేలా కష్టపడతాం
- మీడియాతో కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** పార్టీలో చిన్నచిన్న సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తామని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.సోమవారం ఉట్నూర్ లో జరిగిన ఉమ్మడి జిల్లా పీఏసీ సమావేశానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఒక నేతతో చిన్న ఘర్షణ పై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానంగా కాంగ్రెస్ పార్టీ ఒక పెద్ద కుటుంబమని చిన్న చిన్న విబేధాలు సహజమని అన్నారు. ఇది టీకప్పులో తుఫాన్ లాంటిదన్నారు.కూర్చుని చర్చించి పరిష్కరించుకుంటామన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి పార్టీని పటిష్టపరిచి రానున్న ఎన్నికల్లో విజయం కోసం కృషి చేస్తామన్నారు.రాష్ట్రంలో మారోమారు పార్టీ ని అధికారంలోకి తేవడం రేవంత్ రెడ్డి ని మళ్ళీ ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అలాగే దేశంలో కాంగ్రెస్ పార్టీ ని అధికారంలోకి తేవడం కోసం రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడం కోసం నాయకులు కార్యకర్తలందరం కలిసి పని చేస్తామని అన్నారు.




# నిరుద్యోగ కోరల్లో యువత!

- ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి
- డిమాండ్ చేసిన డివైఎఫ్ఐ సిపిఎం
- ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిరాహార దీక్ష

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 17 మహా**: ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర పిలుపులో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో లక్షలాదిమంది ఉన్నత విద్యను అభ్యసించిన వారికి నిరుద్యోగ కోరల్లో చిక్కిన యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్న నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైందన్నారు. 2014లో మోడీ సర్కార్ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని 12 ఏండ్లు గడుతున్నప్పటికీ ఉద్యోగాలు కల్పించకుండా యువతను మోసం చేస్తున్నారు. కేంద్ర మంతృత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. ఐటి రంగంలో వేల సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చలేదు. మేక్ ఇన్ ఇండియా పేరుతో ప్రజాధనాన్ని వృధా చేయడమే తప్ప కొత్త రిక్రూట్మెంట్ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు కనిపిస్తామని అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు గడుస్తున్నా 62 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందన్నారు. 20వేల కానిస్టేబుల్ పోస్టులకు ఖాళీలు ఉంటే 7వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం అన్ని ప్రభుత్వ శాఖలో సుమారు 9వేల మంది పదవి విరమణ పొందుతున్నారు.

**తెలంగాణలో 2లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి?**

వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న 11వేల కోట్ల స్కాలర్ షిప్ లను విడుదల చేయాలి. ఈనెల 20న నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నిర్వహించే రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడిలో నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, కందుకూరి జగన్, జిల్లా కమిటీ సభ్యులు చాతళ్ల జంగయ్య, బుగ్గరాములు, అంజయ్య, రావుల జంగయ్య, కిషన్, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ, నాయకులు విజయమ్మ, ఇందిరా,స్వప్న, ఆనంద్, శంకర్, నర్సింహ, చందు నాయక్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు జంగయ్య, గజ్జల మహేష్, లింగం, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, తరంగ్, శ్రీకాంత్, మణి, బన్నీ, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలల ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న 9 గురుకుల పాఠశాలలలో 2026-27 విద్యా సంవత్సరానికి 5 వ తరగతి నుండి 9 వ తరగతి వరకు ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్/సెలక్షన్స్ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని 5 బాలుర గురుకుల పాఠశాలలు, 4 బాలికల గురుకుల పాఠశాలలలో ఈ నెల 20 నాటికి వివిధ కమ్యూనిటీ /క్యాస్ట్ కేటగిరీలలో అందుబాటులో ఉండే ఖాళీల ఆధారంగా అదే రోజు స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వివరించారు. వి జి టి, సి ఈ టి, బి.ఎల్.వి, సి ఈ టి.-2026 ప్రవేశ పరీక్షకు హాజరైన బాలబాలికలు మాత్రమే ఈ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. ఆర్ఫన్, సెమీఆర్ఫన్ బాలబాలికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు.అర్హత కలిగిన బాలబాలికలు ఈ నెల 20 నాడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల లోపు నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో స్వయంగా హాజరై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత మెరిట్ జాబితా రూపొందించిన అనంతరం జిల్లాలోని 9 గురుకుల పాఠశాలలలోని 5 వ తరగతి నుండి 9వ తరగతి వరకు వివిధ కమ్యూనిటీ/క్యాస్ట్ కేటగిరీలలో అందుబాటులో ఉన్న ఖాళీలను నిబంధనల ప్రకారం భర్తీ చేస్తామని పేర్కొన్నారు.కమ్యూనిటీకి చెందిన ఆర్ఫన్, సెమీఆర్ఫన్ విద్యార్థులకు ప్రాధాన్యత కల్పించిన అనంతరం, మిగిలిన ఖాళీలను ర్యాంక్ కార్డులోని మెరిట్ క్రమం ఆధారంగా భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. జి టి, సి ఈ టి, బి.ఎల్.వి, సి ఈ టి.-2026 ర్యాంక్ కార్డు, కులం/కమ్యూనిటీ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆర్ఫన్, సెమీఆర్ఫన్ కు సంబంధించిన ధ్రువపత్రాలు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలు జత చేయాలని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రవేశం పొందాలని కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు.





## బిఆర్ఎస్ లోకి యువకుల చేరికలు

- పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి...

**రాజేంద్రనగర్ మహా;** శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలో కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షులు కొన్నెమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి వంద మంది వరకు యవకులను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చరణ్, నిఖిల్, నవీన్, అనిల్,వరుణ్,వర ప్రసాద్, అరుణ్, చంటి, బిఆర్ఎస్ పార్టీలో చేరడంతో కోత్వాల్ గుడా డివిజన్ మరింత బలపడిందని కార్తీక్ రెడ్డి అన్నారు. ప్రజా సమస్యలపై యువకులు గలమెత్తలన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు యువకులు పార్టీ కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో ఏ ఎన్నిక జరిగిన బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేయాలి అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజేందర్, జయసింహ,గుంటిచరణ్, మురళి గౌడ్, రాచమల్ల కార్తీక్, పవిత్ర సాగర్,రాచమల్ల రమేష్, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కాలనీలో మౌలిక వసతులు

- ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి
- కాలనీ అభివృద్ధియే ప్రధాన ధ్యేయం
- న్యూ అంబేద్కర్ నగర్ కాలనీ అధ్యక్షుడిగా శ్రవణ్ కుమార్

**కుషాయిగూడ, మహా :** కాలనీలోని మౌలిక వసతులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాలనీ అభివృద్ధి ప్రధాన ధ్యేయమని న్యూ అంబేద్కర్ నగర్ కాలనీ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ స్పష్టం చేశారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ న్యూ అంబేద్కర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా న్యూ అంబేద్కర్ నగర్ కాలనీ అధ్యక్షుడుగా శ్రవణ్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కాలనీలోని మౌలిక వసతుల కల్పనకు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, కాలనీ అభివృద్ధి ఏ ధ్యేయంగా పనిచేస్తామని, కాలనీలోని మౌలిక వసతులైన డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్తు, తదితర ప్రజల కనీస అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాలనీ నూతన కమిటీ సభ్యుల వివరాలను శ్రవణ్ కుమార్ అందించారు. కాలనీ గౌరవ అధ్యక్షులుగా కుతాడి సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా శివరాత్రి భాస్కర్, ఉపాధ్యక్షులుగా మారయ్య మందస్వామి, మేడ రమ శ్రీదేవి, కోశాధికారిగా టి. భాస్కర్ సంయుక్త కార్యదర్శి నరసింహ, సలహాదారులుగా యాదగిరిరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, వెంకటేష్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నాగరాజు, శంకర్ రేవతి, రాణి,మంజుల,లలిత, చిలుకనిర్మల, శంకర్ యాదవ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## జలవనరుల ధ్వంసం పై ప్రజావాణిలో ఫిర్యాదు..

- చందనవెల్లి కుంట ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి..
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు...

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం నర్కూడ రెవెన్యూ పరిధిలో గల చందనవెల్లి కుంటను కాపాడాలంటూ గ్రామస్తులు లింగం రామారావు, దేవేందర్ సోమవారం శంషాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించినప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 45 ఎకరాల చందన వెల్లి కుంట ( చెరువు ) విస్తరించి ఉంది.ప్రస్తుతం ఈ చెరువులో ఫిరంగినాల మినహా పూర్తిగా కబ్జాకు గురైంది, 45 ఎకరాల ఎఫ్టిఎల్ కలిగి నఈ చెరువు ప్రస్తుతం ఎకార, అరెకరంలో చందనవల్లి చెరువు ఉందన్నారు. చెరువు ఉపరితలంలో బొల్లెవాని చెరువు, ఫిరంగి నాలా తోపాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుతుంది. ఈ చెరువులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ పట్టా భూమి అంటూ నగరం నుంచి లారీలలో మట్టి తరలించి తెచ్చి పూడ్చివేసి అక్రమంగా నిర్మాణాలు నిర్మిస్తున్నారు. చెరువులోకి నీళ్లు రాకుండా ఫిరంగినాలను ధ్వంసం చేసి (సహజ వనరులను) నీళ్లు దారి మళ్లిస్తూ తూములను తొలగిస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ,పంచాయతీ అధికారులు పరోక్షంగా ఆక్రమణదారులకు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చెరువును కాపాడే చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. చెరువు లో అక్రమ నిర్మాణాలు ఫిరంగినాల ఆక్రమణల విషయంలో అక్రమార్కులకు సహకరిస్తున్న అధికారుల పైన చర్యలు తీసుకోవాలని కోరారు.






## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల రద్దుకు రేవంత్ రెడ్డి కుట్ర..

- ఆడబిడ్డల సంక్షేమ పథకాలు కొనసాగించాలి...

**రాజేంద్రనగర్ మహా;** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆందోళనలు చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శంషాబాద్ మహిళా అధ్యక్షులుమ డపతి పరమేశ్వరి, కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్, బిఆర్ఎస్ నాయకులతో కలిసి శంషాబాద్, రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ కార్యకర్తలు, పథకాల లబ్ధిదారులతో కలిసి భారీగా బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్న ఈ పథకాలను నిలిపి వేయడం వల్ల లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పథకాలను పునరుద్ధరించాలని కోరారు. లేనియెడల భారీ ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కాటేదాన్,శంషాబాద్ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మిని ఆపేస్తే... ఆడబిడ్డలను అవమానించినట్టే

**మాజీ మేయర్ మేకల కావ్య**

కుషాయిగూడ , మహా: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయాలని చూడటం దారుణమని, ఇది తెలంగాణ ఆడబిడ్డలను అవమానించినట్టేనని జవహర్‌నగర్ మాజీ మేయర్ మేకల కావ్య మండిపడ్డారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేయకుండా ప్రభుత్వం ఆటంకాలు కల్పించడాన్ని నిరసిస్తూ సోమవారం ఉమ్మడి జవహర్‌నగర్‌లో మాజీ మేయర్ మేకల కావ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రజా పరిపాలన కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మేకల కావ్య మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం ద్వారా ప్రతి ఇంట్లో కేసీఆర్ పెద్దన్నలా, మేనమామలా అండగా నిలిచారని అన్నారు. దేశ చరిత్రలోనే ఈ పథకాలు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. హైకోర్టును సాకుగా చూపుతూ లక్షలాది కుటుంబాలకు భరోసా కల్పించే పథకాలను నిలిపివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచే పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్ చారి, ప్రసాద్, సిద్ధుల యాదవ్, వెంకటేష్, అహ్మద్ పాషా, లక్ష్మణ్, ఎల్లస్వామి, నర్సింహా, మహేష్ యాదవ్, కిరణ్ పాల్గొన్నారు.





# ఎఫ్ బీ ఓ మృతి కేసు ఫస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ

- ఎఫ్బీవో కుటుంబాన్ని పరామర్శించిన ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సంజయ్ కుమార్
- ఎఫ్ బీ వో కుటుంబాన్ని అన్న విధాల ఆదుకుంటాం

**కారేపల్లి, మహ :** ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ మృతి కేసును ఫస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి దోషులకు శిక్ష పడేలా చేస్తామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్ అన్నారు. సోమవారం కారేపల్లి మండలం వెంకిట్యాతండా లో ఎఫ్బీవో నవీన్ కుటుంబాన్ని పీసీసీఎఫ్ వినయ్ కుమార్, సీపీఎఫ్ భీమా నాయక్ లు పరామర్శించారు. నవీన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన వారు నవీన్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎఫ్బీవో నవీన్ కుటుంబానికి అటవీశాఖ నిరంతరం అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ సంజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఎఫ్బీవో నవీన్ మృతి కలచి వేసిందని, ఒక బాధ్యత గల సిన్సియర్ అధికారిని కోల్పోవడం విచారకరమన్నారు. విద్యుద్ఘాతం జరిగిన సమయంలో కరెంటు ట్రిప్ అవుతుందని, ఆ సమయంలో ఆ ప్రాంత సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా నిలువేసి, లైన్ క్లియర్ చేసిన తర్వాతనే సరఫరా పునరుద్ధించడం చేయాల్సి ఉంటుందన్నారు. దానిలో కొంత నిర్లక్ష్యం జరిగిందని, ఈ విషయాన్ని విద్యుత్ సిఎండి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన తెలిపారు ఫారెస్ట్ అధికారులకు ఆయుధాల ఇవ్వటం పై ప్రభుత్వానికి ఆర్జీ పెడతామన్నారు. నవీన్ కుటుంబానికి శాఖ పరంగా అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు కుటుంబానికి ఉద్యోగం, పిల్లల విద్య, ఇంటి జాగా వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ సౌకర్యాల త్వరగా అందేలా చర్యలు తీసుకుంటావని హామీ ఇచ్చారు. వీరి వెంట డిఎఫ్వో అనూజ్ అగ్రవాల్, ఎఫ్డీవో భవాని శంకర్, ఇతర ఫారెస్ట్ అధికారులు ఉన్నారు.




# కారేపల్లి పిహెచ్సి ని 50 పడకల ఆసుపత్రిగా మార్చాలి

- విద్యా సమస్యల పరిష్కరించాలి
- ప్రజావాణిలో సీపీఐ(ఎం) వినతి

**కారేపల్లి, మహ :** ఏజెన్సీ మండలమైన కారేపల్లిలో ప్రజలకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వ ప్రజావాణి కార్యక్రమంలో సీపీఐ(ఎం) సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. 30 కిలోమీటర్ల పరిధిలో కారేపల్లి మండలం విస్తరించి ఉందని ప్రజలకు సరైన వైద్య సేవలు అందటం లేదని వినతిపత్రంలో తెలిపారు కారేపల్లి పిహెచ్సిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్గా అప్గ్రేడ్ చేసి 50 పడకల ఆసుపత్రిగా మార్చడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు దాంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె. నరేంద్ర మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రిగా మార్చటంతో పాటు మండలంలోని చీమలపాడు ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కారేపల్లి పీహెచ్ సీ లో ఖాళీగా ఉన్న మహిళా వైద్యురాలు, ఫార్మసిస్ట్, సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాలలకు వంట షెడ్లు ఏర్పాటు చేయాలని, ఎస్సీ, బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మాణిక్యారం నుంచి మోట్లగూడెం వరకు మెటల్ వేసి అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని, మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చిన వారిలో మండల నాయకులు వజ్జా రామారావు, కొండబోయిన ఉమావతి, యనమనగండ్ల రవి, ముండ్ల ఏకాంబరం, కేసగాని ఉపేందర్, రేగళ్ల మంగయ్య, గంగా ధరణి, ఉపేందర్, భాగ వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు

- షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాలను కొనసాగించాలని డిమాండ్
- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య




**బెల్లంపల్లి,మహ:** బెల్లంపల్లి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మీ - షాదీ ముబారక్ పథకాన్ని నిలిపి వేసిందని,పథకం యధావిధిగా కొనసాగించాలని పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పేదలకు అందాల్సిన కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను నిలిపివేసిందని ఆరోపించారు .పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి సారించి సంబంధిత పథకాలను యధావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చెడిపి వైస్ చైర్మన్ చైర్మన్ తొంగల సత్యనారాయణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, నాయకులు ఏలూరు వెంకటేష్, వార్డు కౌన్సిలర్లు స్రవంతి రాజ్ కుమార్, పలువురు వార్డు కౌన్సిలర్లు ,పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు నూనేటి సత్యనారాయణ, నాయకులు సుందర్ రావు తో పాటు పలువురు నాయకులు బిఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

...బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనలు.. టిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు కన్నెపల్లి ,భీమిని ,తాండూరు ,కాసిపేట, నెన్నెల, వేమనపల్లి మండలాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టారు .వేమనపల్లి మండలంలో పురాణం లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టి తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేసి రోడ్డుపై ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పురాణం లక్ష్మీకాంత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని అందులో భాగంగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే అమలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేమనపల్లి మాజీ సర్పంచ్ కుబిడే మధుకర్ మాజీ జడ్పిటిసి సభ్యుడు తలండి భీమన్నతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు .

# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా**



**మంచిర్యాల,మహా :** ఆటో డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రూ.1,000 కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. అలాగే ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన హామీని కూడా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈవీఎం ఆటోల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాటి రాకను నిలుపుదల చేయాలని కోరారు. రాష్ట్రానికే పరిమితమైన ఓలా ఆటోలు ప్రస్తుతం జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాల వరకు విస్తరించడంతో స్థానిక ఆటో డ్రైవర్ల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్లలో ఆటోలు కొనుగోలు చేసిన పలువురు డ్రైవర్లు ఫైనాన్స్ చెల్లింపులు, కుటుంబ పోషణ భారంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 150 నుంచి 250 మంది వరకు ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆటో జేఏసీ ఇచ్చిన ఆందోళన కార్యక్రమాలకు రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆటో జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొట్ట మధుకర్, మొయ్య రాంబాబు, సుద్దాల రాజు, చల్ల విక్రం, తరగరం శ్రీనివాస్, కే రామ్ కుమార్, ఎండి హబీబ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు అందజేశారు.

# ఆకట్టుకున్న సంఘం శరణం గచ్ఛామి నాటిక..

- అంబేద్కర్ జీవిత చరిత్రకు కళారూపం
- రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయంపై సందేశం
- కళాకారుల ప్రదర్శన అద్భుతం : ఇన్‌చార్జి జీఎం వెంకట రామారావు




**మణుగూరు, మహా :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆశయాలు, సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటాన్ని ప్రతిబింబిస్తూ ప్రదర్శించిన సంఘం శరణం గచ్ఛామి నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సోమవారం మణుగూరు ఏరియాలోని పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు. కార్యక్రమానికి మణుగూరు ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ డి వెంకట రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి నాటిక ప్రదర్శనను ప్రారంభించారు.

**భావోద్వేగభరితంగా అంబేద్కర్ జీవన ప్రస్థానం..**

అంబేద్కర్ బాల్యం, విద్యాభ్యాసం, ఆయన ఎదుర్కొన్న సామాజిక వివక్ష, ఎన్నో అవరోధాలను అధిగమించి విద్య ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగిన తీరు, అణగారిన వర్గాల హక్కుల కోసం సాగించిన పోరాటం, సామాజిక సమానత్వం కోసం చేసిన కృషితో పాటు భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన పోషించిన కీలక పాత్రను కళాకారులు భావోద్వేగభరితంగా కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. పలు సన్నివేశాలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి.

**అంబేద్కర్ ఆశయాలు అందరికీ ఆదర్శం : ఇన్‌చార్జి జీఎం డి వెంకట రామారావు..**

నాటికను వీక్షించిన అనంతరం ఇన్‌చార్జి జీఎం డి వెంకట రామారావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితం, ఆశయాలు, సమాజానికి ఆయన అందించిన సేవలను కళాకారులు అద్భుతంగా ఆవిష్కరించారని అభినందించారు. సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణకు అంబేద్కర్ చేసిన కృషి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు . ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు, ప్రజల్లో కళా, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు సింగరేణి సంస్థ ఇటువంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాజ్యాంగ స్ఫూర్తి, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించేందుకు నాటికలు, ఇతర కళారూపాలు ప్రభావవంతమైన మాధ్యమాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి బి. శ్రీనివాస చారి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణంరాజు, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ వి. మధన్ నాయక్, ఏరియా సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, సింగరేణి హైస్కూల్ హెడ్ మిస్ట్రెస్ ఆర్. కళ్యాణి, సీనియర్ పర్సనల్ అధికారి కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏరియా అధికారులు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు, సింగరేణి ఉద్యోగులు, విద్యార్థులు, సేవా సభ్యులు, కళాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నాటికను తిలకించారు.



# మపంచాయతీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన

**బెల్లంపల్లి మాజీమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు ఆధ్వర్యంలో**

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి నియోజకవర్గం కన్నెపల్లి మండలంలోని జన్కపూర్ గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి బెల్లంపల్లి మాజీమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు ఆధ్వర్యంలోశంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా జన్కపూర్ గ్రామ ప్రజలు గ్రామ అభివృద్ధికి సహకరిస్తూ గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామానికి నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనం అందుబాటులోకి రావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్పుల మల్లేష్ ,బెల్లంపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎల్పుల రోహిత్, గ్రామ సర్పంచ్ బోరిగామ వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోరిగామ జలపతి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయులు, బెల్లంపల్లి మార్కెట్ కమిటి డైరెక్టర్ బట్టు శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

# గోదావరిలో కుటుంబం ఆత్మహత్యాయత్నం

రాజమహేంద్రవరం, మహా: తూర్పుగోదావరి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం సమీపంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పంచాయతీరాజ్ శాఖ ఏఈ నూకరాజుతో పాటు ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య గల్లంతయ్యారు.గోదావరిలోకి దూకిన సమయంలో నూకరాజు మనవడిని మత్స్యకారులు గుర్తించి రక్షించారు.గల్లంతైన ముగ్గురి కోసం పోలీసులు, సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చేపట్టాయి.ఘటనకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసే కుట్ర...

- మాజీ జడ్పీటీసీ పోశం నరసింహారావు ఆరోపణ..
- తులం బంగారం హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలు..
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన.. వినతిపత్రం అందజేత

**మణుగూరు, మహా :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు పోశం నరసింహారావు ఆరోపించారు. సోమవారం మణుగూరులో టీఆర్ఎస్ పార్టీ నేత కుంట లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. పేదలకు ఉపయోగపడుతున్న ఇటువంటి సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. నూతన వధువులకు తులం బంగారం అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. పథకాల అమలుపై స్పష్టత ఇవ్వకుండా లబ్ధిదారులను అయోమయానికి గురిచేయడం సరికాదన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు సంబంధించి న్యాయస్థానం ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం సమగ్రంగా కౌంటర్ దాఖలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని నరసింహారావు విమర్శించారు. కోర్టు ఆదేశాలను గౌరవించి పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రాజకీయ కక్షతో నిలిపివేసే ప్రయత్నం చేయడం పేదలపై భారం మోపడమేనన్నారు. తులం బంగారం హామీతో పాటు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పథకాల భవిష్యత్తుపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన ప్రకటన చేయాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనం అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శ్రీను, అడపా అప్పారావు, వట్టం రాంబాబు, యాదగిరి గౌడ్, ముద్దంగుల కృష్ణ, దర్శనాల శ్రీనివాస్, జావీద్ పాషా, చెన్నకేశవులు, అక్కి నరసింహారావు, ప్రభుదాస్, పప్పుల ప్రసాద్, చంద్రకళ, అడబాల సత్యవతి, ఏనిక ప్రసాద్, సర్పంచ్ స్వరూప, రజిత, జ్యోతి, వేల్పుల సురేష్, బోసెట్టి రవి, బుద్దుల ప్రసాద్, తురక రామకోటి, వావిలాల నరసయ్య, కంభంపాటి శ్రీను, ఆవుల శ్రీను, స్వర్ణలత, సరోజనమ్మ, జ్యోత్స్న, గుగులోత్ భాస్కర్, యగ్గడి నరసింహారావు, రంజిత్, వార్డు సభ్యులు పాషా, శారద, పద్దం శ్రీను, వడ్లూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




# శ్రీరాగా విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని మేదరబస్తిలో ఉన్న శ్రీ రాగా హై స్కూల్‌లో ఇటీవల టాటా ఏఐఏ సంస్థ కొత్తగూడెం బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం విజేతలకు టాటా ఏఐఏ లోగోతో కూడిన గోల్డ్ మెడల్స్ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. శ్రీ రాగా విద్యార్థులు విద్యతో పాటు వివిధ సృజనాత్మక పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో శ్రీ రాగా స్కూల్ కరస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్, డైరెక్టర్ కవిత, టాటా ఏఐఏ బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీశ్ కుమార్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో తారా ప్రసాద్, సీనియర్ బిజినెస్ అసోసియేట్ దుర్గానాథ్, బిజినెస్ అసోసియేట్ నాగుమీరా, వరలక్ష్మితో పాటు పాఠశాల సిబ్బంది రాంబాబు, మహాలక్ష్మి, చరిత శ్రీ, స్వాతి, అఖిల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి జాతర కమిటీ నియామకం

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి (సిద్ధులు గుట్ట) జాతర నూతన కమిటీని సోమవారం ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా కొత్త నరసింహారెడ్డి, అధ్యక్షులుగా శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షులు శివారెడ్డి, ఆర్గనైజర్ దూడల వెంకటేష్ గౌడ్, కోశాధికారి పండరీనాథ్, సలహాదారులు గణేష్ గుప్తా లను ఎన్నుకున్నారు.






# మిస్టరీతో ఆకట్టుకుంటున్న 'అగధ'

టాలీవుడ్‌లో తరచూ కనిపించే సాధారణ హారర్ సినిమాలకు భిన్నంగా తెరకెక్కిన మిస్టిక్ అండ్ సూపర్‌నేచురల్ అట్మాస్పియరిక్ థ్రిల్లర్‌గా 'అగధ' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించిన శ్రవణ్ రెడ్డి తన విభిన్నమైన నటనతో ఆకట్టుకుంటున్నారు. సాధారణ హారర్ చిత్రాల తరహాలో దెయ్యాలు, జంప్ స్కేర్స్‌ను నమ్ముకోకుండా.. మిస్టిసిజం, సూపర్‌నేచురల్ అంశాలను కథలో కీలకంగా మేళవించారు. భయపెట్టడం కంటే వాతావరణం, సన్నివేశాల ద్వారా ప్రేక్షకుల్లో నిరంతర ఉత్కంఠను కొనసాగించేలా సినిమాను రూపొందించినట్లు కనిపిస్తోంది. కథలోని మిస్టరీ, సస్పెన్స్‌కు నటీనటుల పెర్ఫార్మెన్స్ కూడా బలంగా నిలిచింది. ముఖ్యంగా శ్రవణ్ రెడ్డి పోషించిన పాత్రలో హీరో, యాంటీ హీరో అనే రెండు భిన్నమైన కోణాలు కనిపిస్తాయి. సినిమా ప్రారంభంలో సాధారణంగా, మన పక్కింటి వ్యక్తిలా కనిపించే ఈ పాత్ర.. కథ ముందుకు సాగుతున్న కొద్దీ ఊహించని మార్పులకు లోనవుతుంది. పాత్రలోని పాజిటివ్, నెగెటివ్ షేడ్స్ మధ్య ఉన్న గ్రే జోన్‌ను శ్రవణ్ రెడ్డి చక్కగా బ్యాలెన్స్ చేసినట్లు తెలుస్తోంది. పాత్రకు అనవసరమైన హంగులు జోడించకుండా, చాలా సహజమైన నటనతో శ్రవణ్ రెడ్డి తన పెర్ఫార్మెన్స్‌ను కొనసాగించారు. లౌడ్ యాక్టింగ్, అతిగా హావభావాలు ప్రదర్శించకుండా.. సైలెంట్ ఎక్స్‌ప్రెషన్స్‌తోనే పాత్రలోని అంతర్లీన భావాలను ప్రేక్షకులకు చేరవేశారు. ముఖ్యంగా కొన్ని సన్నివేశాల్లో ఆయన ఏమీ చేయకుండా నిశ్శబ్దంగా కనిపించినా.. ఆ పాత్ర వెనుక ఏదో రహస్యం దాగి ఉందనే ఆసక్తి ప్రేక్షకుల్లో కలిగేలా నటించారు. సినిమా ముగిసే వరకు తన పాత్రను పూర్తిగా అర్థం చేసుకునే అవకాశం ప్రేక్షకులకు ఇవ్వకుండా సస్పెన్స్‌ను కొనసాగించడంలో శ్రవణ్ రెడ్డి నటన కీలకంగా నిలిచింది. కథలో వచ్చే మలుపులకు అనుగుణంగా పాత్రలోని మరో కోణాన్ని బయటకు తీసుకురావడం ద్వారా ఆయన తన పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారని చెప్పొచ్చు. సాధారణ హారర్ అంశాలకు దూరంగా.. మిస్టరీ, సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచే ప్రయత్నం చేసిన 'అగధ'లో శ్రవణ్ రెడ్డి పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

# పిల్లల పెళ్లి వారి ఇష్టం.. నా బాధ్యత కాదు: ప్రగతి


పిల్లల పెంపకం, వారి భవిష్యత్తు, పెళ్లి విషయంలో తన అభిప్రాయాలను నటి ప్రగతి స్పష్టంగా వెల్లడించారు. పిల్లలు తమ జీవితంలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకునే వరకు తల్లిగా తన బాధ్యత ఉంటుందని.. ఆ తర్వాత వారి వ్యక్తిగత జీవితంలో తాను జోక్యం చేసుకోనని ఆమె తెలిపారు. పెళ్లి అనేది పిల్లల వ్యక్తిగత నిర్ణయమని, తల్లిదండ్రులపై దానిని బలవంతంగా మోపడం సరికాదని అభిప్రాయపడ్డారు.

పిల్లలు కెరీర్ పరంగా స్థిరపడే వరకు వారి బాధ్యత తనదేనని ప్రగతి చెప్పారు. అయితే పెళ్లి విషయంలో మాత్రం నిర్ణయం పూర్తిగా వారిదేనని స్పష్టం చేశారు. మానసికంగా, ఆర్థికంగా సిద్ధంగా ఉన్నప్పుడు.. తమ జీవితంలోకి మరో వ్యక్తిని భాగస్వామిగా ఆహ్వానించాలని అనిపిస్తే అప్పుడే పెళ్లి చేసుకోవాలని అన్నారు. "తమ పెళ్లి తమకు చేసుకోవడం కూడా రానప్పుడు.. ఇక వాళ్లకు పెళ్లి ఎందుకు చేయాలి?" అంటూ తనదైన శైలిలో ప్రశ్నించారు.

పిల్లలపై తల్లిదండ్రులకు ప్రేమ, బాధ్యత ఉండటం సహజమే అయినప్పటికీ.. వారి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన నిర్ణయాలను వారికే వదిలేయాలని ప్రగతి అభిప్రాయపడ్డారు. పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వడంతో పాటు జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకునే విధంగా వారిని తీర్చిదిద్దడం ముఖ్యమని చెప్పారు.

**పిల్లలను చూసి గర్వంగా ఉంది**

తన పిల్లలే తన ప్రపంచమని ప్రగతి ఆనందం వ్యక్తం చేశారు. తన కుమారుడు చదువు పూర్తి చేసుకుని బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడని తెలిపారు. అలాగే తన కుమార్తె ప్రస్తుతం అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తోందని చెప్పారు. పిల్లలను స్వతంత్రంగా ఎదిగేలా పెంచినందుకు తల్లిగా ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. సమాజానికి మంచి పౌరులుగా నిలిచేలా తన పిల్లలను పెంచాననే భావన తనకు గర్వంగా ఉందని ప్రగతి పేర్కొన్నారు. వారి విజయాలను చూస్తుంటే ఒక తల్లిగా ఎంతో సంతోషంగా అనిపిస్తుందని చెప్పారు.



# అనన్య నాగళ్ల నేచురల్ లుక్

తెలుగు సినీ నటి అనన్య నాగళ్ల మరోసారి సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఓ సింపుల్ అండ్ నేచురల్ ఫొటో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. ఎలాంటి మేకప్ లేకుండా చాలా సహజంగా కనిపించిన అనన్య.. తన లుక్‌ను అభిమానులతో పంచుకున్నారు. సాధారణంగా సినీ తారలు మేకప్‌తో, గ్లామరస్ లుక్‌లో కనిపిస్తుంటారు. అందుకు భిన్నంగా అనన్య నో మేకప్ లుక్‌లో కనిపించడంతో అభిమానులు ఆసక్తిగా స్పందిస్తున్నారు.

ఈ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసిన అనన్య నాగళ్ల.. "జ్వరం, కొంచెం ఫిల్టర్‌తో నో మేకప్ లుక్‌లో ఎలా ఉన్నాను?" అంటూ సరదాగా క్యాప్షన్ పెట్టారు. జ్వరంతో ఉన్నప్పటికీ తన సహజమైన రూపాన్ని అభిమానులతో పంచుకోవడం విశేషం. ఫొటోలో అనన్య ఎలాంటి హంగామా లేకుండా సింపుల్‌గా కనిపించారు. ఆమె క్యాండిడ్ ఎక్స్‌ప్రెషన్, నేచురల్ లుక్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. కొందరు నెటిజన్లు ఆమె అందాన్ని ప్రశంసిస్తూ కామెంట్లు చేస్తున్నారు.

అనన్య నాగళ్ల

సి నీ

ప్రయాణం విషయానికి వస్తే.. 2019లో వచ్చిన 'మల్లేశం' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో అనన్య కీలక పాత్రలో నటించారు. తొలి సినిమాతోనే తన నటనకు మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సినిమా తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమలో ఆమెకు వరుస అవకాశాలు లభించాయి. ఆ తర్వాత పవన్ కల్యాణ్ నటించిన 'వకీల్ సాబ్' సినిమాలో నటించి అనన్య మరింత గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఈ సినిమాలో ఆమె పోషించిన పాత్ర ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. పెద్ద హీరోల చిత్రాల్లో నటించే అవకాశాన్ని అందిపుచ్చుకోవడంతో ఆమె కెరీర్‌కు మరింత ఊపొచ్చింది. అనంతరం పలు తెలుగు చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకోవడంపై అనన్య నాగళ్ల ఆసక్తి చూపిస్తున్నారు. విభిన్నమైన కథాంశాలు, బలమైన పాత్రలు ఉన్న సినిమాల్లో నటిస్తూ తన నటనా పరిధిని విస్తరించుకుంటున్నారు. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే అనన్య.. తన సినిమాలకు సంబంధించిన విషయాలతో పాటు వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తాజాగా నో మేకప్ లుక్‌లో షేర్ చేసిన ఈ ఫొటో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది.



# అనుపమ కామెంట్లపై ధృవ్ విక్రమ్ స్పందన



తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనుపమ పరమేశ్వరన్ ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తన గత ప్రేమ బంధం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ కావడంతో.. ఆ బంధం ఎవరితోననే దానిపై అభిమానులు, నెటిజన్లు రకరకాల ఊహాగానాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమిళ నటుడు ధృవ్ విక్రమ్‌తో అనుపమకు సంబంధించిన ఓ పాత వీడియో క్లిప్ కూడా మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అనుపమ తన వ్యక్తిగత జీవితంలోని ఓ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. దాదాపు రెండేళ్ల పాటు స్వార్థపూరిత, నియంత్రించే స్వభావం ఉన్న వ్యక్తితో ప్రేమలో ఉన్నానని ఆమె తెలిపారు. ఆ సమయంలో మానసికంగా, శారీరకంగా ఎంతో ఇబ్బందిని ఎదుర్కొన్నానని.. ఆ బంధం నుంచి బయటపడిన తర్వాత మళ్లీ సాధారణ స్థితికి రావడానికి చాలా సమయం పట్టిందని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో.. అనుపమ ప్రస్తావించిన వ్యక్తి ఎవరనే చర్చ మొదలైంది.

ఇదే సమయంలో ధృవ్ విక్రమ్‌తో కలిసి అనుపమ పాల్గొన్న ఓ పాత పాడ్‌కాస్ట్ వీడియో క్లిప్ నెట్టింట ప్రత్యక్షమైంది. 'బైసన్' సినిమా ప్రమోషన్ల సమయంలో జరిగిన సరదా సంభాషణకు సంబంధించిన ఈ వీడియోలో.. సోషల్ మీడియాలో పోస్ట్ చేయాల్సిన ఫొటోలను ధృవ్ ఎంపిక చేసేవారని అనుపమ చెప్పిన విషయం ఇప్పుడు వైరల్‌గా మారింది. అయితే అప్పట్లో సరదాగా సాగిన ఆ మాటలను ఇప్పుడు కొందరు నెటిజన్లు మరో కోణంలో చూస్తున్నారు.

నుపమ తన మాజీ ప్రియుడి గురించి చేసిన వ్యాఖ్యలకు ఈ పాత వీడియోను జోడిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు, కామెంట్లు చేస్తున్నారు. ధృవ్ వ్యవహారశైలిపై ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే అనుపమ తన మాజీ ప్రియుడి పేరును ఎక్కడా అధికారికంగా వెల్లడించలేదు. దీంతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఇప్పటివరకు స్పష్టమైన ఆధారం లేదనే విషయాన్ని కూడా పలువురు గుర్తుచేస్తున్నారు.

మరోవైపు ధృవ్ విక్రమ్ గతంలో నటించిన 'ఆదిత్య వర్మ' సినిమాను కూడా కొందరు నెటిజన్లు ప్రస్తావిస్తున్నారు. ఆ సినిమాలో అతడు పోషించిన పాత్ర స్వభావాన్ని, ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చను పోలుస్తూ కామెంట్లు చేస్తున్నారు. అయితే సినిమా పాత్రలకు, నటుడి నిజ జీవిత వ్యక్తిత్వానికి సంబంధం ఉందని చెప్పడానికి ఎలాంటి ఆధారం లేదు. అనుపమ కూడా తన సోషల్ మీడియా పోస్టులపై వస్తున్న ఊహాగానాలకు గతంలోనే వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. తాను పెట్టే పోస్టులు తన వ్యక్తిగత ఎదుగుదల, జీవితంపై తన ఆలోచనల్లో వచ్చిన మార్పులకు సంబంధించినవేనని.. వాటిని ఎవరో ఒక వ్యక్తిని ఉద్దేశించి చేస్తున్న వ్యాఖ్యలుగా చూడొద్దని స్పష్టం చేశారు. తన గత సంబంధంలో ఉన్న వ్యక్తి పేరు కూడా ఆమె ఎప్పుడూ బహిరంగంగా వెల్లడించలేదు.

**ఆత్మపరిశీలన చేసుకుంటున్నా..**

ఈ వివాదంపై తాజాగా ధృవ్ విక్రమ్ చేసిన వ్యాఖ్యలు కూడా చర్చకు దారితీశాయి. 'ఇండియా టుడే తమిళనాడు రౌండ్‌టేబుల్' కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. తన గురించి జరిగే పబ్లిక్ చర్చలు, ప్రచారాలు తనపై ఎలాంటి ప్రభావం చూపవని చెప్పడం కష్టమేనని పేర్కొన్నారు. అయితే ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు తాను ఆత్మపరిశీలన చేసుకుంటూ.. తనకు అత్యంత సన్నిహితులైన వ్యక్తుల మద్దతుతో ముందుకు సాగుతున్నానని తెలిపారు.

బయటి ప్రపంచం నుంచి వచ్చే ఒత్తిళ్ల కంటే.. మన గురించి మనం నిజాయితీగా తెలుసుకోవడం, సన్నిహితుల మద్దతు కలిగి ఉండటం ముఖ్యమని ధృవ్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అయితే ఆయన వ్యాఖ్యల్లో అనుపమ పేరును నేరుగా ప్రస్తావించకపోవడం గమనార్హం. దీంతో సోషల్ మీడియాలో ఈ అంశంపై మరిన్ని చర్చలు కొనసాగుతున్నాయి. మొత్తానికి అనుపమ చేసిన వ్యాఖ్యలు, ధృవ్ తాజా స్పందన నేపథ్యంలో ఇద్దరి పేర్లు మరోసారి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి.

# వచ్చే నెల కూడా కోర్టుకు వెళ్లాలి.. పల్లవి ప్రశాంత్ ఆవేదన

తెలుగు బుల్లితెరపై విశేష ఆదరణ పొందిన రియాలిటీ షో 'బిగ్‌బాస్ తెలుగు సీజన్7' విజేత పల్లవి ప్రశాంత్ తాజాగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సామాన్య రైతుబిడ్డగా బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టి.. ప్రేక్షకుల మద్దతుతో టైటిల్ సొంతం చేసుకున్న ఆయన.. విజయం తర్వాత తన జీవితంలో ఎదురైన ఇబ్బందులను ఓ సందర్భంలో వెల్లడించారు. ప్రైజ్‌మనీ, కారు బహుమతి, కోర్టు కేసులతో పాటు కుటుంబంలో చోటుచేసుకున్న పరిణామాల గురించి భావోద్వేగానికి గురయ్యారు.

**ప్రైజ్‌మనీలో భారీగా కోత**

బిగ్‌బాస్‌లో గెలుచుకున్న ప్రైజ్‌మనీని రైతులకు పంచుతానని చెప్పి మాట తప్పాడంటూ తనపై వచ్చిన విమర్శలపై పల్లవి ప్రశాంత్ స్పందించారు. తనకు ప్రకటించిన రూ.35 లక్షల ప్రైజ్‌మనీలో పన్నుల రూపంలో భారీగా కోత పడిందని తెలిపారు. అలాగే బహుమతిగా ప్రకటించిన కారును తీసుకోవాలంటే సుమారు రూ.8.5 లక్షలు పన్నుల రూపంలో చెల్లించాల్సి వచ్చిందని చెప్పారు. అంత మొత్తం తన వద్ద లేకపోవడంతో కారును తీసుకోలేకపోయానని పేర్కొన్నారు. అయితే ప్రైజ్‌మనీ, కారు బహుమతికి సంబంధించిన ఈ వివరాలు ప్రశాంత్ చేసిన వ్యాఖ్యలే కాగా.. దీనిపై సంబంధిత సంస్థల నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది.

**గెలుపు ఆనందం ఎక్కువ రోజులు లేదు**

ఒక రైతుబిడ్డ కూడా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలడని నిరూపించాలనే లక్ష్యంతోనే బిగ్‌బాస్‌లోకి వెళ్లినట్లు ప్రశాంత్ తెలిపారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని ప్రేక్షకుల మద్దతుతో టైటిల్ గెలుచుకున్నప్పటికీ.. ఆ విజయాన్ని పూర్తిస్థాయిలో ఆస్వాదించలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. విజయం తర్వాత చోటుచేసుకున్న వివాదాలు, కేసులు తనతో పాటు కుటుంబ సభ్యులను కూడా తీవ్ర ఆందోళనకు గురిచేశాయని చెప్పారు.

**వచ్చే నెల కూడా కోర్టుకే'**

బిగ్‌బాస్ విజేతగా నిలిచిన తర్వాత తన జీవితంలో ఊహించని పరిణామాలు ఎదురయ్యాయని పల్లవి ప్రశాంత్ పేర్కొన్నారు. కేసుల కారణంగా తరచూ కోర్టుకు హాజరుకావాల్సి వస్తోందని తెలిపారు. "వచ్చే నెల కూడా కోర్టుకు వెళ్లాలి.. ఆ తర్వాత నెల కూడా వెళ్లాల్సి ఉంటుంది" అంటూ తన పరిస్థితిని వివరించారు. టైటిల్ గెలిచిన ఆనందం కంటే.. ఆ తర్వాత ఎదురైన సమస్యలే తనను ఎక్కువగా బాధించాయని చెప్పారు.

ఇదే సమయంలో తన కుటుంబంలో జరిగిన మరో ఘటనను గుర్తుచేసుకుని ప్రశాంత్ భావోద్వేగానికి గురయ్యారు. ఒకరికి సాయం చేసేందుకు వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తన తమ్ముడు తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. ఆ ఘటన తమ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసిందని.. దాని ప్రభావం నుంచి ఇప్పటికీ పూర్తిగా బయటపడలేకపోతున్నామని చెప్పారు.

**ఆరోపణలపై స్పష్టత రావాల్సిందే**

ప్రైజ్‌మనీ, బహుమతులపై వర్తించే పన్నులు నిబంధనలకు అనుగుణంగా ఉంటాయి. అయితే తనకు ప్రకటించిన నగదు బహుమతి, కారుకు సంబంధించిన పన్నుల విషయంలో పల్లవి ప్రశాంత్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. ఈ అంశాలపై బిగ్‌బాస్ నిర్వాహకులు లేదా సంబంధిత సంస్థలు అధికారికంగా స్పందిస్తే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

సామాన్య రైతుబిడ్డగా బిగ్‌బాస్ హౌస్‌లోకి ప్రవేశించి విజేతగా నిలిచిన పల్లవి ప్రశాంత్.. టైటిల్ తర్వాత తనకు ఎదురైన పరిస్థితులను బహిరంగంగా పంచుకోవడంతో ఆయన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ముఖ్యంగా కోర్టు కేసులు, కుటుంబ సమస్యల గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com